

30న ఉమ్మడి జిల్లా హేతువాద మహాసభ 5
వలకట్ల స్థలం కోసం పడవల పోటీలు 5

బాలల విద్యా, వైజ్ఞానిక జాతీయస్థాయి ప్రదర్శనలో ప్రతిభావంతులకు సన్మానం

అమలాపురం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): 52వ రాష్ట్రీయ బాలల విద్యా వైజ్ఞానిక జాతీయస్థాయి ప్రదర్శనలో అత్యుత్తమ ప్రశంసలతో అవార్డు పొందిన విద్యార్థినులను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా అభినందించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు సైక్లింగ్ మిల్‌తో బహుళ ప్రయోజనాల ప్రాజెక్టును రూపొందించి శాస్త్రవేత్తలను అబ్బురపరిచారని ఆయన కొనియాడారు. ప్రాజెక్టు రూపకర్తలైన పదోతరగతి విద్యార్థినులు ఉండ్రాజవరపు భవ్యశ్రీజోత్స్న, సోరపల్లి శశివదన, గైడ్ టీచర్, హెచ్‌ఎం గుబ్బల నాగసత్యనారాయణలను డీఈవో హెచ్చరించి అభినందించారు. కార్యక్రమంలో బడుగు సత్యనారాయణ, టీఎస్వీ సుబ్రహ్మణ్యం, ఫిజికల్ డైరెక్టర్ విఘ్నేశ్వరుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో సలీంబాషా

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయండి

- తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో గోనెసంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచండి
- పౌరసరఫరాల అధికారులకు కలెక్టర్ ఆదేశం

అమలాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రానున్న మూడురోజుల్లో వాతావరణశాఖ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఇప్పటికే వరికోతలు నిర్వహించి ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ పౌరసరఫరాల అధికారులకు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అమరావతి నుంచి కలెక్టర్‌తో గురువారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో ధాన్యం సేకరణ, గోనెసంచులు, టార్పాలిన్ల సరఫరా, రియల్‌టైమ్ గవర్నెన్స్ డాక్యుమెంట్ అప్‌లోడింగ్, సంక్షేమ వసతిగృహాలు, సంక్షేమ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మరమ్మతుల అంశాల పురోగతిపై సమీక్షించారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు పండించిన ధాన్యాన్ని త్వరితగతిన విక్రయించుకోవాలని సూచించారు. గోనెసంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని గిట్టుబాటు ధర పొందాలని రైతులకు సూచించారు. ఆస్పత్రి వైద్యసేవలు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, దేవాలయాల్లో దర్శనాలు, అన్నక్యాంటీన్ల నిర్వహణ తదితర అంశాల్లో లబ్ధిదారుల సంతృప్తి స్థాయిలను మెరుగుపరిచి జిల్లాను ముందంజలో ఉంచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజలనుంచి వచ్చే అర్జీలను పరిష్కార విషయంలో నూరుశాతం సంతృప్తిస్థాయిలో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం సేకరిస్తున్న ధాన్యం రకాలకు అనుగుణంగా వరి వంగడాలు సాగు చేస్తూ వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జేసీ నిషాంతి, పౌరసరఫరాల అధికారి ఉదయ్‌భాస్కర్, జిల్లా సివిల్‌సప్లయిస్ మేనేజర్ శ్రీనివాస్, డీఎల్డీవో రాజేశ్వరరావు, సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి పాల్గొన్నారు.



నాలుగోది గిరిజన జిల్లా

రంపచోడవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుతం మూడు కాదు.. నాలుగు జిల్లాలు. సీఎం చంద్రబాబు ఆమోదంతో రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం జీవో నెం 1492తో గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రంపచోడవరం డివిజన్ పరిధిలోని రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి, గుర్తేడు, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాలు.. చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాలను కలిపి ఈ కొత్త గిరిజన జిల్లాగా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాల ఏర్పాటు చట్టంలోని నిబంధనల మేరకు ప్రాథమిక ప్రకటనను జారీ చేసే అధికారాన్ని అల్లూరి జిల్లా కలెక్టర్‌కు కట్టబెడుతూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. గురువారం నుంచి 30 రోజుల వ్యవధిలో ఈ ప్రతిపాదిత జిల్లా ఏర్పాటు విషయంలో తమకు ఉన్న అభ్యంతరాలు, మెరుగైన సూచనలను అల్లూరి జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వకంగా తెలియపరచవచ్చు. గడువు ముగిసిన అనంతరం ప్రభుత్వం ఈ కొత్త జిల్లా ఏర్పాటును గెజిట్ రూపంలో ప్రకటించడం ఇక లాంఛనమే. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రంపచోడవరం, చింతూరు డివిజన్‌లోని ప్రజలకు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఇంతవరకూ ఉన్న వందలాది కిలోమీటర్ల భారం తగ్గుతోంది.

పోలవరం లేని జిల్లా

పోలవరం పేరుతో ప్రకటించిన ఈ జిల్లాలో పోలవరం ప్రాంతానికి చోటే లేదు. ఈ జిల్లాకు పోలవరం అనే పేరు ప్రభుత్వం ఎందుకు పెట్టిందన్నది చర్చనీయాంశంగా మారింది. 30 రోజుల గడువు అనంతరం ఈ జిల్లా పరిధిలో పలు మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఈ కొత్త జిల్లా పరిధిలోనే పోలవరం ముంపు మండలాలు పూర్తిగా రెండు, పాక్షికంగా మూడు ఉండడం గమనార్హం. పోలవరం ప్రాజెక్టు కింద రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాల పరిధి లోని ఉన్న ముంపు గ్రామాల గిరిజన నిర్వాసితులందరికీ కొత్త జిల్లా పరిధిలోనే పునరావాసం కల్పించే యోచన కూడా ప్రభుత్వానికి ఉందని తెలుస్తోంది.

అడిగింది లేదనలేదు.. కోరింది కాదనలేదు.. ఇష్టానుసారం ఇవ్వలేదు.. ఆశలు ఫలించాయి.. ఆకాంక్షలు నెరవేరాయి.. గత వైసీపీ చేసిన తప్పులను సరిదిద్దుతూ సరికొత్త బాటలు వేశారు.. కొత్త సరిహద్దులు నిర్ణయించారు.. గిరిజనులు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఎక్కడో 300 కి.మీ దూరంలో ఉన్న పాడేరు వెళ్లాల్సి వచ్చేది..దీంతో ఇబ్బందులకు గురయ్యేవారు.. ఇది గమనించిన చంద్రబాబు ఏజెన్సీ వాసులకు ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.. ఈ మేరకు రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు.. పెద్దాపురం నియోజకవర్గంలో ఉన్న సామర్లకోట కాకినాడ డివిజన్‌లో ఉండేది.. డివిజన్ కేంద్రం మార్చాలని ఏనాటి నుంచో విన్నపాలు చేస్తున్నారు.. కూటమి ప్రభుత్వం సామర్లకోటను పెద్దాపురం డివిజన్‌లో చేర్చింది. మండపేట నియోజకవర్గం కోనసీమ జిల్లాలో ఉండేది. ఈ నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేశారు. ఇలా అడిగింది లేదనకుండా.. కోరింది కాదనకుండా దారిచూపారు..

- పోలవరం జిల్లా ఏర్పాటు
- జిల్లా కేంద్రంగా రంపచోడవరం
- తూర్పులో చేరిన మండపేట
- పెద్దాపురం డివిజన్‌కు సామర్లకోట
- నోటిఫికేషన్ విడుదల చేసిన సర్కారు
- 31 వరకు అభ్యంతరాల స్వీకరణ

ఇక పెద్దాపురంలోనే సామర్లకోట

సామర్లకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలాన్ని ఇక నుంచి పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి చేరుస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి గెజిట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవోఆర్‌టీ 1493 పేరిట గురువారం రాత్రి జిల్లా కేంద్రానికి, పెద్దాపురం, కాకినాడ ఆర్డీవో కార్యాలయాలకు ఉత్తర్వులు చేరాయి. మొదటి సార్వత్రిక ఎన్నికల నాడే పెద్దాపురం నియోజకవర్గంలో పెద్దాపురం,సామర్లకోట మండలాలు చేర్చినా పరిపాలనాపరమైన కార్యకలాపాలను మాత్రం పెద్దాపురం మండలం పెద్దాపురం ఆర్డీవో కార్యాలయ పరిధి, సామర్లకోట మండలం కాకినాడ ఆర్డీవో పరిధిలోను కేటాయించారు. ఎన్నికల నిర్వహణ మాత్రమే పెద్దాపురం ఆర్డీవో పరిధిలో పర్యవేక్షించేవారు.ఒకే నియోజకవర్గం మొత్తం మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలన్న కూట మి ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇక నుంచి సామర్లకోట మండల కార్యకలాపాలు పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లోకి అనుసంధానం కానున్నాయి.

తూర్పున..మండపేట

రాజమహేంద్రవరం/మండపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో ఉండే మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేస్తూ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు డిసెంబరు 31 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు ప్రజలు జిల్లా కేంద్రం అమలాపురం వెళ్లాలంటే ఇబ్బందులు పడేవారు. నియోజకవర్గం అంతా ఏకతాటిపై నిలబడి తూర్పులో విలీనం చేయాలని పోరాడారు. 2008 వరకు ఆలమూరు నియోజకవర్గం రాజమహేంద్రవరం పార్లమెంట్‌లోనే ఉండేది. 2009లో నియోజకవర్గ పునర్విభజన సమయంలో ఆలమూరు నుంచి విడిపోయి మండపేట నియోజకవర్గం ఏర్పడింది. అప్పుడు ఆలమూరు కొత్తపేట నియోజకవర్గంలో కలవగా మండపేట నియోజకవర్గంలో అనపర్తి నియోజకవర్గం పరిధిలోని రాయవరం మండలం ఇక్కడ కలిసింది. 2009లో ఏర్పడిన మండపేట నియోజకవర్గం 16 ఏళ్ల తర్వాత తిరిగి ఇప్పుడు తూర్పుగోదావరి జిల్లాలో చేరింది. మండపేట నియోజకవర్గంలో మూడు మండలాలతో పాటు ఒక మునిసిపాలిటీ ఉంది. 42 పంచాయతీలు ఉన్నాయి. మండపేట మునిసిపాలిటీ, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలు ఉన్నాయి. నియోజకవర్గ జనాభా 3.45 లక్షలు ఉండగా ఓటర్లు 2.20 లక్షలు మేర ఉన్నారు. జిల్లాలో 21 మండలాలు ఉంటాయి.రాజమండ్రి మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు మండపేట, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు,జిల్లా అర్బన్, గ్రామీణ ప్రాంతాలు ఉంటాయి.

గ్రీన్ సిగ్నల్

- కొత్త పంచాయతీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- యథావిధిగానే ఉండనున్న రెవెన్యూ గ్రామాలు
- వచ్చే మార్చిలో పంచాయతీ ఎన్నికల నాటికి ప్రక్రియ పూర్తి

అమలాపురంరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కొత్త పంచాయతీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే రీఆర్గనైజేషన్ చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కొత్త పంచాయతీల ఏర్పాటుకు అవరోధంగా ఉన్న బ్యాన్‌ను ప్రభుత్వం ఎత్తివేసింది. ఆర్థిక స్వయం సమృద్ధి ఉన్న పంచాయతీల్లోని శివారు ప్రాంతాలను కొత్తగా పంచాయతీలుగా ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. ఐదేళ్లుగా ఉన్న బ్యాన్ తొలగిపోవడంతో కొత్తగా పంచాయతీలు ఏర్పాటు చేసుకోవాలనుకునే వారికి మార్గం సుగమమైంది. వచ్చే ఏడాది మార్చిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఈలోపుగానే కొత్త పంచాయతీల ఏర్పాటు ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది.

ప్రజలు ఇష్టంతోనే..

ఉదాహరణకు కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలో దూరంగా ఉన్న ఏనుగుల మహల్, ఇందుపల్లిశివారు భట్లపాలెం వంటి ప్రాంతాలు పంచాయతీలుగా ఏర్పాటు చేసుకోవచ్చునని అధికారులే చెప్తున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఇష్టపూర్వకంగా ప్రతిపాదనలు చేసి గ్రామసభ ఆమోదిస్తే వాటి సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం పరిశీలించి కొత్త పంచాయతీలను ఏర్పాటు చేస్తుంది. బండారులంక శివారు నక్కావారిపేట ప్రాంతం గ్రామానికి దూరంగా ఎక్కడో ఉంది. నడిపూడి గ్రామంతో కలిసి ఆ ప్రాంతం ఉంటుంది. ఆ ప్రాంతాన్ని నడిపూడిలో కలుపుకునే వెసులుబాటు ఉత్తర్వుల ద్వారా కల్పించారు. పురపాలక సంఘాలకు సమీపంలోఉన్న గ్రామాల విలీనానికి అవకాశాలు కల్పించవచ్చునని భావిస్తున్నారు. ఇప్పటికే అమలాపురం పురపాలక సంఘానికి ఆనుకుని ఉన్న పేరూరు శివారు కొంకాపల్లి ప్రాంతం, కామనగరువు శివారు కిమ్స్ ఆస్పత్రి వంటివి పురపాలక సంఘంలో విలీనం చేసే ప్రతిపాదనను ఆమోదించారు. స్థానిక ఎన్నికల వేళ కొత్త పంచాయతీల ఏర్పాటు, విలీనాల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంటుంది. కొత్త పంచాయతీలు ఏర్పడినా రెవెన్యూ గ్రామాలు యథావిధిగానే కొనసాగుతాయి.



జిల్లాలో డిప్యూటీ ఎంపీడీవోల నియామకం

అమలాపురం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయంతీసుకుంది. దీనిలోభాగంగా మూడంచెల వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే జోన్-2లో భాగంగా పలు జిల్లాలకు చెందిన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు, డిప్యూటీ ఎంపీడీవో హోదా కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారు. జిల్లాలోని 22 మండలాలకు డిప్యూటీ ఎంపీడీవోలను క్షేత్రస్థాయి పరిశీలనకు నియమిస్తూ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అల్లవరం మండలానికి శెట్టిమల్లి రాజమోహన్, ఆలమూరుకు షణ్ముకి వీర్రాజు, అల్లవరం మండలం లక్ష్మీ, అమలాపురం మండలానికి గరిమెళ్ల రవి, అంబాజీపేట అబ్బాస్‌అలీమహ్మద్‌లను నియమించారు.కె.రమేష్‌బాబు(ఆత్రేయపురం), వి.రాజేష్ (ఐ.పోలవరం), కొత్తాల సాంబమూర్తి(కె.గంగవరం), వెలిశెట్టి శ్రీరామమూర్తి(కపిలేశ్వరపురం),సరిపెల్ల సూర్యనారాయణరాజు(కాట్రేనికోన), గుదే శ్రీనివాసనారాయణరావు(కొత్తపేట), చిటికెన సత్యనారాయణ(మలికిపురం), తిక్కిరెడ్డి శ్రీనివాస్(మామిడికుదురు), శ్రీరాముల అనిల్‌కుమార్(మండపేట), బి.సుజాత(ముమ్మిడివరం), ఆర్.సూర్యనారాయణమూర్తి(పి.గన్నవరం), పినిశెట్టి వీరభద్రరావు(రామచంద్రపురం), వెంటూరి అమర్‌నాథ్‌చౌదరి(రావులపాలెం), వేగేశ్న వెంకటరామకృష్ణంరాజు(రాయవరం), పి.సత్తిబాబు(రాజోలు), ఎస్‌పీహెచ్ శ్రీనివాసదీక్షితులు(సఖినేటిపల్లి), డి.పోలీకాంతారావు(ఉప్పలగుప్తం) మండలాలకు డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరంతా మండలస్థాయిలో గ్రామ సచివాలయ, వార్డు సచివాలయ అధికారులుగా విధులు నిర్వహిస్తారని కలెక్టర్ మహేష్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొత్త పోలింగ్ కేంద్రాలకు అధికారుల నియామకం

- కలెక్టర్‌తో ఎన్నికల సంఘం సీఎస్ కాన్ఫరెన్స్.. ఓటర్ల జాబితా సవరణపై ఆరా

అమలాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటర్ల నమోదుకు సంబంధించి వచ్చిన అన్ని దరఖాస్తుల్లో పెండింగ్‌లు లేవని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1,200 ఓటర్లు దాటిన చోట కొత్తగా 108 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి వివేక్‌యాదవ్ గురువారం అమరావతి నుంచి కలెక్టర్లతో ఓటర్ల జాబితా మ్యాపింగ్‌పై కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితా మ్యాపింగ్‌పై ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, సహాయ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారులు, బూత్ లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లకు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో బూత్ లెవెల్ అధికారులకు సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కొత్తగా ఏర్పాటైన పోలింగ్ కేంద్రాలకు బూత్‌లెవెల్ అధికారుల నియామకంపై జిల్లాలవారీగా పురోగతిపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. కాన్ఫరెన్సు అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. ఎపిక్ కార్డుల పంపిణీ ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఓటర్ల మ్యాపింగ్ 42శాతం పూర్తయిందన్నారు. ఓటర్ల నమోదుకు సంబంధించి 6, 7, 8ఫారాలకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో లేవన్నారు. సెక్షన్ సూపరింటెండెంట్ నాగలక్ష్మమ్మ, ఉపతహశీల్దార్ శివరాజ్ పాల్గొన్నారు.

టెండర్లు వేసినా పనులు చేయరేం?

- అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం

అమలాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అమలాపురం పురపాలక సంఘంలో అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లు టెండర్లు వేసినాపనులు ఎందుకు చేపట్టడం లేదని టీడీపీ కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు అధికారులను ప్రశ్నించారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ 57వ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన వాడీవేడిగా సాగింది. మున్సిపల్ డీఈఈ సత్యనారాయణ మాట్లాడుతూ బడ్జెట్‌ను దాటి పనులు చేస్తున్నామని కొన్నిచోట్ల కాంట్రాక్టర్లను ఒప్పించినట్టు వివరించారు. రూ.6కోట్ల మేర కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సి ఉందని, ప్రస్తుతం రూ.3కోట్లతో పనులు జరుగుతున్నాయని చెప్పారు. కౌన్సిలర్ సంసాని బులినాని మాట్లాడుతూ ప్రస్తుత కౌన్సిల్‌లో వార్డులవారీగా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించిన వివరాల జాబితాలను ఆయా వార్డుల కౌన్సిలర్లకు ఇవ్వాలని చెప్పినా ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని మండిపడ్డారు. పురపాలక సంఘంలో పీహెచ్, నాన్‌పీహెచ్‌వర్కర్లు 76మందిని తొలగించమని కౌన్సిల్ చెప్పకపోయినా కార్మిక సంఘాల నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కౌన్సిల్ అధికారాలు, హక్కులను కార్మికసంఘ నాయకులు తమ చేతుల్లోకి తీసుకుని సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న ప్రచారాలను కౌన్సిల్‌లో బయటపెట్టారు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్న ఆయా నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సంబంధిత పత్రాలను చైర్‌పర్సన్ ద్వారా మున్సిపల్ డీఈకి అందజేశారు. కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ మాట్లాడుతూ తాగునీటిని సరఫరా చేసే ట్యాంకర్లపై వివరాలు అడిగారు. కౌన్సిలర్ దొంగ నాగసుధారాణి మాట్లాడుతూ సినిమా రోడ్డు, విశ్వరూప్ మార్గ్‌ల్లో ఆక్రమణలతో ట్రాఫిక్ స్తంభించిపోతోందన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన డీపీఎస్‌పై కౌన్సిలర్లకే అవగాహన లేదని కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీపీఎస్ రాణిసంయుక్త మాట్లాడుతూ అవసరమైతే ప్రభుత్వ సూచనల మేరకు భవనాల తొలగింపునకు ముందుకు వెళ్తామన్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి 19మందికి తిరిగి నిధులు వెనక్కి ఇవ్వాల్సి ఉందన్నారు. వైస్‌చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, ప్రతిపక్ష నేత యేడిద శ్రీను పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు..

పోషకాహారం అందించాలి: డీఆర్వో



అమలాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని ప్రభుత్వమే జోన్‌లవారీగా నిర్వహించిన మెనూలో గుడ్డు, రాగిజావ, చిక్కీ, పోషకాహారం తాజాగా వండి వడ్డించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి ఆదేశించారు. బడి భోజనం ఏర్పాట్లలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గుర్తించిన లోపాలపై ఎన్జీవోల ప్రతినిధులతో పథక అమలు అధికారులతో గురువారం సమీక్షించారు. ఈసందర్భంగా డీఆర్వో మాధవి మాట్లాడుతూ కిచెన్ గార్డెన్స్ 858 పాఠశాలల్లో మాత్రమే అమలులో ఉన్నట్టు చెప్పారు. తాజా కాయగూరలు పండించి పిల్లలకు పోషకాహారం పెట్టాలన్నారు. మిగిలిన పాఠశాలల్లో స్థలాలు లేక కిచెన్ గార్డెన్లు నిర్వహించడం లేదన్నారు. వ్యాక్సిన్లు పిల్లలకు పూర్తిస్థాయిలో సరఫరా చేయడంలేదని, ఎన్జీవోల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో పూర్తిస్థాయిలో సరఫరాకు కృషి చేయాలని సూచించారు.ఏఎన్‌ఎంలు పిల్లల ఆరోగ్య భద్రతపై దృష్టి సారించాలన్నారు. పిల్లల్లో ఎలర్జీలు, ఫుడ్ పాయిజనింగ్ వంటి సంఘటనలు ఉత్పన్నం కాకుండా శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల నిర్వహణకు పేరెంట్స్ కమిటీలు మధ్యాహ్న భోజన అంశాన్ని నెలసరి సమావేశాల్లో ప్రాధాన్యంగా చర్చించి తీర్మానాల ద్వారా సమర్థ నిర్వహణకు కృషి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులతో ఫుడ్ సేఫ్టీ ఓరియంటేషన్ చేయాలని డీఆర్వో సూచించారు. డీఈవో షేక్ సలీంబాషా, సమగ్రశిక్ష ఏపీసీ మమ్మీ, డీఎంహెచ్‌వో దుర్గారావుదొర, ఏడీఎంహెచ్‌వో భరతలక్ష్మి పాల్గొన్నారు.



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

భీమేశ్వరుడి హుండీ ఆదాయం రూ.43.95 లక్షలు

ద్రాక్షారామ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి హుండీ ద్వారా రూ.43,95,359, అన్నదానం హుండీ ద్వారా రూ.52,682 ఆదాయం సమకూరినట్టు సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవానీ తెలిపారు.గురువారం స్వామి హుండీలను జిల్లా దేవదాయశాఖ అధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షణలో తెరిచి లెక్కించారు. అక్టోబరు 15 నుంచి గురువారం వరకు హుండీ ఆదాయాన్ని లెక్కించినట్టు ఈవో తెలిపారు. కార్యనిర్వహణాధికారులు శ్రీనివాస్, బాలకృష్ణార్జునరావు, సొసైటీ చైర్మన్ ముప్పనపల్లి గణేష్, టీడీపీ నాయకులు పెంకె సాంబశివరావు,ఆళ్ల బుజ్జి, దవులూరిరామకృష్ణ, అల్లం రామకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

మూడోదశలో 28 గ్రామాల్లో రీసర్వే

- రైతుల వద్ద ఉన్న ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం
- పి.గన్నవరంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జేసీ నిషాంతి

పి.గన్నవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలంలో జేసీ టి.నిషాంతి గురువారం సుడిగాలి పర్యటన చేశారు. రీసర్వే, చౌకడిపో, రైతుసేవాకేంద్రం, ధాన్యం కొనుగోలు తదితర అంశాలను ఏకకాలంలో తనిఖీచేశారు. తొలుత ముంగండపాలెం శివారు గాజుగుంటలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించిన జేసీ మ్యాప్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. పోతవరంలో చౌకడిపోను పరిశీలించి స్టాక్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో ఉన్నవ్యత్యాసాలను సరిచేసుకోవాలని డీఎస్‌వోతో జేసీ ఫోన్‌లో మాట్లాడి అక్కడేఉన్న ఎంఎస్‌వో పూర్ణిమకు స్టాక్ విషయం డీఎస్‌వోతో కలిసి పరిశీలన చేయాలని ఆదేశాలు జారీచేశారు. అక్కడినుంచి పోతవరంఆర్‌ఎస్‌కేకు చేరుకుని సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు విషయంలోఆర్‌ఎస్‌కేలను పరిశీలన చేయాలని ఏడీఏ విజయకుమార్‌కు సూచించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మొదటి పంటకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 3.50లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి లక్ష్యమని, ప్రభుత్వంనుంచి 2.45లక్షలమెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతులు ఉన్నాయన్నారు. అవసరమైన ఆర్‌ఎస్‌కే కేంద్రాల్లో దిగుబడిని బట్టి టార్గెట్‌లను పెంచుతామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు,నష్టంలేకుండా రంగుమారిన ధాన్యాన్ని సైతం కొనుగోలుకు ఆదేశాలు ఇచ్చామన్నారు. రీసర్వేకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొదటిదశలో 17గ్రామాలు, రెండోదశలో 29గ్రామాల్లో రీసర్వే జరిగిందని, ప్రస్తుతం మూడోదశలో 28గ్రామాల్లో రీసర్వే జరుగుతుందన్నారు. తహశీల్దార్ శ్రీపల్లవి, ఇన్‌చార్జ్ ఏడీఏ విజయకుమార్, ఇన్‌చార్జ్ మండల సర్వేయర్ జేకేడీ ప్రసాద్, ఆర్‌ఐ డాంఘే ఉన్నారు.



సర్వేయర్లకు సూచనలు ఇస్తున్న జేసీ నిషాంతి

విభిన్న ప్రతిభావంతులకు రేపు జిల్లాస్థాయి ఆటల పోటీలు

అమలాపురంటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 29న జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడాభివృద్ధి అధికారి రుద్ర వైకుంఠరావు తెలిపారు. దివ్యాంగ క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడంతోపాటు వారికి క్రీడారంగంలో ఉత్తేజం కల్పించడమే క్రీడా పోటీల లక్ష్యమని ఆయన అన్నారు. ప్రధానంగా బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనరిచిన దివ్యాంగ క్రీడాకారుల వివరాలను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్)కు పంపిస్తామన్నారు. అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో దివ్యాంగులైన స్త్రీపురుషులు, బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిబ్బంది పర్యవేక్షణలో బ్యాడ్మింటన్, చెస్, కేరమ్స్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. బ్యాడ్మింటన్‌లో అండర్-17, అండర్-20 సీనియర్స్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. దివ్యాంగుల సంక్షేమశాఖను సమన్వయం చేసుకుని స్పోర్ట్స్ అసోసియేషన్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పోటీలకు ఏర్పాట్లు చేస్తుంది. ప్రత్యేక దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా డిసెంబరు 3న సంబంధిత శాఖల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. దివ్యాంగ క్రీడాకారులు మరిన్ని వివరాలకోసం 7993329433 నెంబరును సంప్రదించాలన్నారు.

యానాంలో ఏపీ బీసీ ఫెడరేషన్ సమావేశం 5



కరప మండలం పెద్దాపురప్పాడులో నాటిన జామ మొక్క

చిన్నారులకు విద్యాబుద్ధులే కాదు... విలువలతో కూడిన అంశాలపైనా అవగాహన కల్పించాలి. చిన్నప్పటి నుంచే సమాజంపై అవగాహన తీసుకురావాలి. అందుకు తగ్గట్టుగానే అంగన్వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. మాతాశిశు రక్షణ కోసం ఏర్పాటుచేసిన ఇవి నేడు చిన్నారులకు పాఠాలు నేర్పించడంతో పోషక విలువలు సమృద్ధిగా ఉండే ఆహారం అందిస్తున్నాయి.



కాకినాడ రూరల్ మండలం తూరంగిలో అరటి చెట్టు

అద్భుత ఫలాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార వాటికలు

» ఆకుకూరలు, పండ్ల తోటల పెంపకం » వాటితోనే బాలింతలు, గర్భిణులకు పోషకాహారం తయారీ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో 1,886 అంగన్వాడీ స్కూళ్లు ఉన్నాయి. వీటి ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నారు. వారి ఆరోగ్య సంరక్షణకు అనేక చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఇవి అంగన్వాడీ ఆరోగ్య రక్షణ కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. అంగన్వాడీ కేంద్రాల ఆవరణలో పోషకాహారం కలిగే ఉండే ఆకుకూరలు, కూరగాయల సాగు చేపడుతున్నారు. పండ్ల మొక్కలను పెంచుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతూ ఇందుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తోంది. 488 కేంద్రాల్లో ఈ తరహా పోషణ వాటికలు ఏర్పాటు చేశారు.



అంగన్వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు పోషకాలు అధికంగా ఉండే ఆకుకూరలు, కూరగాయలతో వండిన మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. ఇటీవల వ్యవసాయంలో రసాయనాల వాడకం పెరిగిపోవడంతో ఆకుకూరలు, కూరగాయలు విషతుల్యమవుతున్నాయి. ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో పలు రాకల ఆకుకూరలు, కూరగాయలను సేంద్రియ విధానంలో సాగు చేసే చర్యలు చేపట్టారు. తోటకూర, పాలకూర, గోంగూర వంటి ఆకుకూరలతో పాటు అరటి, బెండకాయ, వంకాయ, టమాటా పండిస్తున్నారు. ఖాళీ స్థలం ఉన్న చోట అరటి, దానిమ్మ, జామ వంటి పండ్ల మొక్కలు వేశారు. అవి ఫలాలు అందిస్తున్నాయి. స్థలాలు అనువుగా ఉన్న కేంద్రాల్లో తొలి విడత ఏర్పాటు చేసిన పోషణ వాటికలు సత్ఫలితాలు అందిస్తున్నాయి. ఈ ఉత్పత్తులను గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కేంద్రాల్లో పోషణ వాటికలు ఏర్పాటు చేయనున్నారు. విటమిన్లు అందించే పండ్ల మొక్కలతో పాటు ఔషధ గుణాలున్న మొక్కలూ పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు.





కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలోని అంగన్వాడీ కేంద్రంలో పండిస్తున్న గోంగూర, గోరుచిక్కుడు కాయలు



అంగన్వాడీ కేంద్రం ఆవరణలో పండిన పండ్లతో చిన్నారులు

సుబ్రహ్మణ్యేశ్వరుడు ఆకాశ తేజసుడు

ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు





భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న కోటేశ్వరరావు, సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



గొల్లప్రోలు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శివుడు మాదిరిగానే సుబ్రహ్మణ్యేశ్వరుడు ఆకాశ తేజసుడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఆలవెల్లి మల్లవరంలోని స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన సంతాన శయన మందిరాన్ని ఆయన గురువారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివ తేజస్సు వలనే బంగారం, వెండి ఇతర లోహాలు పుట్టుకొచ్చాయని, సుబ్రహ్మణ్యేశ్వరుని ఉత్పత్తి సమయంలో ఇది జరిగిందని తెలిపారు. స్వామికి పూజ చేయడమంటే భూమి అంతటికీ పూజ చేయడమేనని చెప్పారు. భూమి శాప విముక్తి కోసమే సుబ్రహ్మణ్యేశ్వరుడు జన్మించాడని తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వరుడు పంచభూత స్వరూపడని, అగ్ని నుంచి పుట్టాడు కాబట్టి అగ్ని స్వరూపడయ్యాడని చెప్పారు. దీపాన్ని వెలిగించడం, హారతి ఇవ్వడం ఆయనకు అత్యంత ప్రీతికరమన్నారు. అనంతరం చాగంటి దంపతులను ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కడిమిశెట్టి కుమార భాస్కరరెడ్డి, ఉపాధ్యక్షుడు అత్యారి దక్షిణామూర్తి, కార్యదర్శి కడిమిశెట్టి విజయభాస్కరరెడ్డి, సంయుక్త కార్యదర్శి అబ్బిరెడ్డి అప్పారావు, కోశాధికారి ఆకొండి విశ్వనాథం, సభ్యులు కడిమిశెట్టి వెంకటరావు, అరిగెల రామయ్యదొర, పాలపర్తి చలమయ్య, రాయవరపు ఆదినారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'పాడా' ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి బదిలీ



పిఠాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రాంత ప్రాధికార అభివృద్ధి సంస్థ (పాడా) ప్రాజెక్టు డైరెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.చైత్రవర్షిణి బదిలీ అయ్యారు. ఆమెను గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరు కార్యాలయంలోని మైక్రో క్రెడిట్ విభాగం స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణం రిలీవ్ చేయాలని సూచించారు. పాడా తొలి రెగ్యులర్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆమె వ్యవహరించారు. ఆరోగ్య కారణాలతో ఇటీవల పలుమార్లు సెలవుపై వెళ్లారు. ఆరోగ్య కారణాల రీత్యా తనను బదిలీ చేయాలని ఆమె చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా ఎవరినీ నియమించలేదు.



లక్ష్మీగౌతమ్, తమన్‌లను అభినందిస్తున్న శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్

బీసీసీఐ విజయ్ మర్చంట్ క్రికెట్ ట్రోఫీ...
ఏపీ క్రికెట్ జట్టుకు 'శ్రీప్రకాష్' విద్యార్థుల ఎంపిక

కాకినాడ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ విజయ్ మర్చంట్ క్రికెట్ ట్రోఫీ కోసం ఏపీ క్రికెట్ జట్టుకు శ్రీప్రకాష్ సినర్జీ స్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 11వ తరగతి విద్యార్థి జి.లక్ష్మీగౌతమ్, 10వ తరగతి విద్యార్థి కె.తమన్ ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ క్రికెట్ జట్టుకు తమ విద్యార్థులు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులతో పాటు కోచ్ జి.దుర్గాప్రసాద్‌ను ఏపీ క్రికెట్ సంఘ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, విజయ్‌ప్రకాష్, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు తలాటం హరీష్, కార్యదర్శి నక్కా వెంకటేష్, సంయుక్త కార్యదర్శి సమీరా మెమెంటోలతో సత్కరించి అభినందించారు.

నేటి నుంచి దత్త జయంతి
సప్తాహ మహోత్సవాలు

మహా సంస్థానంలో వచ్చే నెల 4 వరకు ప్రత్యేక పూజలు



పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతి

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శుక్రవారం నుంచి దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. డిసెంబరు 4వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా పలు ప్రత్యేక పూజలు, స్వాములకు విశేష అలంకారాలు చేస్తారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలిరానున్న దృష్ట్యా ఆలయాధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ మహా గణపతి పూజ, కలశస్థాపన, శత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, మూలమంత్ర అనుష్టానం, శీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాద శ్రీవల్లభ చరితామృత పారాయణ, సాయంత్రం 4 గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, 5 గంటలకు హారతులు, పల్లకీ సేవ, సాయంకాలార్చన, మంగళహారతి జరుపుతారు. అలాగే ప్రతిరోజూ గోపూజ, అభిషేకం, రుద్రాభిషేకం, దత్త హోమం, వెండి పల్లకీ సేవ, దత్త జయంతి రోజున ఊయల సేవ జరుగుతాయి.

రోజువారీ పూజలు.. శుక్రవారం దత్తాత్రేయ స్వామికి గ్రామోత్సవం, సర్వపుష్పపూజ, 29న లక్ష బిల్వార్చన, 30న సహస్ర చామంతి పూజ, డిసెంబరు 1న లక్ష తులసి అర్చన, 2న సహస్ర లిల్లీ పుష్ప పూజ, 3న గులాబి అర్చన, సంపెంగ పుష్ప పూజ, 4న పూలంగి సేవ, బిల్వార్చన, పూర్ణాహుతి జరుగుతాయి. దత్త జయంతి రోజు సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, పశ్చిమ బెంగాల్, ఒడిశాల నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు.

పాదగయ క్షేత్రంలో ఇలా..

పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్త జయంతి సప్తాహ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. వేదోక్త విధిననుసరించి దత్తాత్రేయ మంత్రానుష్టానము, హోమాలు, గురుచరిత్ర, వేద పారాయణా, యతిపూజ, లక్ష బిల్వార్చన, సత్యదత్త వ్రతాదులచే సప్తాహ దీక్షతో ఉత్సవాలు నిర్వహిస్తారు. డిసెంబరు 4 వరకు జరిగే ఉత్సవాల సమయంలో ప్రతిరోజూ మహా గణపతి పూజ, రుత్విక్ వరుణలు, ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, శీర్ష ఉపనిషత్, వేదసూక్తాలు, మూలమంత్రాలు, దత్త మూలమంత్రం, జపాలు, సామూహిక గురుచరిత్ర పారాయణ జరుగుతాయి. మధ్యాహ్నం దత్తమూల మంత్రహోమాలు, సాయంత్రం సాయంకాల విశేష పుష్పార్చన నిర్వహిస్తారు. తొలి రోజైన శుక్రవారం సహస్ర కలువ పుష్పార్చన, 29న సహస్ర తామర పుష్పార్చన, 30న లక్ష బిల్వార్చన, డిసెంబరు 1వ తేదీన సహస్ర గులాబీ అర్చన, 2న సహస్ర చామంతి పుష్పార్చన, 3న లక్ష తులసి అర్చన 4న సర్వపుష్పార్చన, సాయంత్రం దత్తాత్రేయుడికి ఊయల సేవ జరుగుతాయి.

అన్ని సౌకర్యాలు కల్పించాం

పాదగయ క్షేత్రంలో జరిగే దత్త జయంతి సప్తాహ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చే భక్తులు, దత్తమాలధారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. వారం పాటు ప్రత్యేక పూజలు, దత్త జయంతి రోజున విశేష కార్యక్రమాలు జరుగుతాయి.

-కాట్నం జగన్మోహన శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి, పాదగయ క్షేత్రం.



పిఠాపురం పాదగయ క్షేత్రంలోని స్వయంభూ దత్తాత్రేయస్వామి

3న ఇరుముడి ధారణ

దత్తమాల ధరించి మండల, అర్ధ మండల, సప్తాహ దీక్ష చేసిన భక్తులకు డిసెంబరు 3న ఇరుముడి ధారణ, దత్తస్వాముల నగరోత్సవం నిర్వహిస్తారు. 4వ తేదీ తెల్లవారుజామున దత్త దీక్ష విరమణ, ఇరుముడి సమర్పణ, మహా పూర్ణాహుతి, మహాపూజ జరుగుతాయి.

ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

దత్త జయంతి మహోత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశాం. సులభతరంగా దర్శనమయ్యేలా చర్యలు తీసుకున్నాం. ఉచిత అన్నప్రసాద వితరణ చేస్తాం.

-ఆర్.సౌజన్య, కార్యనిర్వహణాధికారి, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టు ఎంపిక



ఉమ్మడి జిల్లా ఖోఖో అండర్-14 జట్టుతో ఎంఈవో సత్యరంగారావు

సర్పవరం జంక్షన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-14 ఖోఖో జట్టు ఎంపికను కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ ఏపీఎస్పీ జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో గురువారం నిర్వహించారు.స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఖోఖో అండర్-14 తుది జట్టు 12 మంది సభ్యుల ఎంపిక కోసం ఈ నెల 23 నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లా, ఏఎస్‌ఆర్ జిల్లాల పరిధిలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో రాణించిన 12 మంది సభ్యులను ఖోఖో తుది జట్టుగా ఎంపిక చేసినట్టు ఎంఈవో-1 తుమ్మల సత్యరంగారావు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా జట్టు సభ్యులకు స్పోర్ట్స్ టీషర్ట్‌లను అందించారు. విశాఖలో ఈ నెల 28 నుంచి 30వరకు జరిగే అంతర జిల్లాల పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరిన జట్టు సభ్యులను ఇన్‌చార్జి హెచ్ఎం మూర్తి అభినందించారు.కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పీఈటీలు హరిబాబు, త్రిమూర్తులు, కిరణ్‌కుమార్, సుప్రియ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై కేంద్రం చిత్తశుద్ధితో ఉంది

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణపై కేంద్ర ప్రభుత్వంతో చిత్తశుద్ధితో ఉందని భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. అయినా పదేపదే తమ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తూ, విమర్శిస్తూనే ఉంటే అలాంటి వారి చిత్తశుద్ధిని తాము అనుమానించాల్సి ఉంటుందన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని ఒక హోటల్లో బీజేపీ గోదావరి జోన్ మండలాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల ప్రశిక్షణ తరగతులకు ఆయన విచ్చేసి మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారం కోసం రూ.11,500 కోట్ల ప్యాకేజీ మంజూరు చేయడమే తమ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను సీఎం చంద్రబాబు.. కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లకు చెప్పడం ద్వారా ప్యాకేజీ సాధించామని పేర్కొన్నారు.

కన్నుల పండువగా సుబ్రహ్మణ్యుడి రథోత్సవం




శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం

బిక్కవోలు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పేరొందిన తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులోని శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవాల్లో రెండో రోజైన గురువారం స్వామి వారి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం 1.17 గంటలకు స్వామి వారిని మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ రథంలో వుంచారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రథం లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథం ముందు నిర్వహించిన కోలాటాలు, బ్యాండు మేళాలు, కేరళ వాయిద్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామి ఆలయం నుంచి వంగా వారి వీధి మీదుగా బిక్కవోలు మెయిన్‌రోడ్, రాజారావుపేట రోడ్ వరకూ వెళ్లి ఆలయం వద్దకు చేరింది. ఉత్సవ కమిటీ సభ్యులు పాలచర్ల శివ ప్రసాద్‌చౌదరి, చాగంటి సాయిబాబారెడ్డి, పల్లి రాజారెడ్డి, సింగారపు రామారావు, గుణ్ణం రమేష్ చౌదరి, త్రిమూర్తులు, కొమ్మోజు శ్రీను పాల్గొన్నారు. డీఎస్పీ విద్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బాణసంచా కాల్పుల కనువిందు..

షష్ఠి మహోత్సవం సందర్భంగా బుధవారం అర్ధరాత్రి కాల్చిన బాణసంచా వీక్షకులను కనువిందు చేసింది. గ్రామానికి చెందిన గోలింగేశ్వర ఫైర్ వర్క్స్, కనకదుర్గ హుస్సేనియా ఫైర్ వర్క్స్ వారు పోటా పోటీగా బాణసంచాను స్థానిక హైస్కూలు గ్రౌండులో కాల్చారు. ఈ సందర్భంగా ఆకాశంలో వెలుగులు వెదజల్లే బ్యాటరీ బాక్సులు, నిప్పులు చెలరేగే సర్పాలు, ఈతచెట్లు, మల్లెపందిరిలు, సెర్చిలైట్లు, విష్ణు, సూర్య చక్రాలు, అందర్నీ ఆకట్టుకున్నాయి.



బాణసంచా కాల్పులో నిప్పులు గక్కుతున్న సర్పం

బూత్ స్థాయి నుంచి బీజేపీ బలోపేతం

పార్టీ గోదావరి జోన్ ప్రశిక్షణ వర్గ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



బీజేపీ గోదావరి జోన్ ప్రశిక్షణ వర్గ్ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రాష్ట్రాధ్యక్షుడు మాధవ్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్ ఆధారంగా రాష్ట్రంలో బీజేపీని పటిష్ఠం చేయడంతోపాటు కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక సమస్యలపై ఉద్యమాలు చేపట్టడం ద్వారా ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో జరిగిన బీజేపీ గోదావరి జోన్ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల ప్రశిక్షణ వర్గ్‌లో ఆయన మాట్లాడుతూ కలసి పని చేయడానికి ఈ శిక్షణా తరగతులు ప్రేరణగా నిలుస్తాయి అన్నారు. మండల నాయకులు పార్టీ తరఫున క్రియాశీలకంగా వ్యవహరించాలని, కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని అన్నారు. వాడ వాడలా పార్టీ పతాకాలు ఎగరాలని దిశానిర్దేశం చేశారు. కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ప్రశిక్షణ వర్గ్ నిర్వహించుకోవడం ద్వారా నాయకుల్లో నిబద్ధత, నాయకత్వం పెరుగుతుందని అన్నారు. జాతీయపార్టీకి మండల అధ్యక్షులుగా పనిచేస్తున్నామనే సంగతి తెలుసుకోవాలని సూచించారు. సొంతంగా 16 రాష్ట్రాల్లో, మిత్ర పక్షాలతో కలసి ఐదు రాష్ట్రాల్లోనూ అధికారంలో ఉన్నామనే సంగతి మరచిపోకూడదని, కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక అంశాల ఆధారంగా పనిచేయాలని ఆయన సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలతో ఎలా కలసి పనిచేయాలనేదానిపై కార్యాచరణకు అనుగుణంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఉదయం స్థానిక గౌతమిఘాట్ వద్ద ఎమ్మెల్సీ సోము వీర్రాజు, యోగా సాధకులతో కలిసి కలసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా మన జీవనశైలిలో ఒక భాగమని, మన పూర్వీకులు మనకు అందించిన ఒక వైద్య విధానమని పేర్కొన్నారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, నాయకులు వేటుకూరి సూర్యనారాయణరాజు, బొమ్ముల దత్తు, నిర్మలా కిషోర్, లక్ష్మీ ప్రసన్న, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత నీటిజీవనం!

రంపచోడవరం దగ్గరలో భారీ నీటి ప్రాజెక్ట్ భూపతిపాలెం రిజర్వాయర్ ఉంది. ఇక్కడ ఎంతోమంది మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. సువిశాల, ప్రశాంతమైన ఈ ప్రాంతంలో ఓ మత్స్యకార కుటుంబం చేపలు పడుతుండగా 'ఆంధ్రజ్యోతి కెమెరా' క్లిక్ మనిపించిందిలా.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



కొంగలు గుంపు.. కనులకు ఇంపు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో దమ్ము చేస్తున్న పంటపొలంలో కొంగలు ఇలా గుంపుగా సందడి చేశాయి.

–మండపేట (ఆంధ్రజ్యోతి)

డొంకరాయిలో సినీ సందడి

సినీ నటుడు రవితేజపై సన్నివేశాల చిత్రీకరణ

మోతుగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చింతూరు జిల్లా వై. రామవరం మండలం డొంకరాయి గ్రామంలో గురువారం సినిమా షూటింగ్ జరిగింది. సినీ నటుడు రవితేజ హీరోగా నటిస్తున్న నూతన చిత్రానికి సంబంధించిన డొంకరాయి మార్కెట్ సెంటర్లో జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణ క్రీడామైదానంలో షూటింగ్ జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సన్నివేశాలు చిత్రీకరించారు. రవితేజను చూడడానికి అధికంగా అభిమానులు తరలివచ్చారు. మైత్రీ మూవీస్ మేకర్స్ బ్యానర్‌పై దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్ కాగా.. సాయి కుమార్, జగపతిబాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. నెలరోజుల పాటు మొదటి షెడ్యూల్ ఈ ప్రాంతాల్లో చిత్రీకరించడానికి రెండో షెడ్యూల్‌ను జనవరి నుంచి నిర్వహించడానికి చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తుంది.



మార్కెట్ సెంటర్లో సినీనటుడు రవితేజ

అంతర్వేదిలో సినీనటుల పూజలు

అంతర్వేది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సినీనటులు రాజీవ్‌కనకాల, బెల్లంకొండ ప్రవీణ్, జబర్దస్త్ అశోక్ విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం చేసుకున్న వారికి వేద పండితులు మహాదాశీర్వచనం అందజేశారు. అనంతరం సినీ నటులతో భక్తులు సెల్ఫీలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్, బెల్లంకొండ సూరిబాబు పాల్గొన్నారు.



ఆలయంలో నటులు రాజీవ్‌కనకాల, ప్రవీణ్, అశోక్

శ్రీ పుష్పయోగం... భక్తజన తన్మయత్వం..

అన్నవరంలో ముగిసిన సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్య కల్యాణోత్సవాలు

అన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్యకల్యాణోత్సవాలు గురువారం రాత్రి జరిగిన శ్రీపుష్పయోగ మహోత్సవంతో ముగిశాయి. రాత్రి 8గంటలకు నవదంపతులైన స్వామి,అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులు గావించి అర్చకస్వాములు గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహించి స్వామి, అమ్మవార్ల అష్టోత్తర శతనామాలతో పుష్పార్చన గావించారు. అనంతరం సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన ఊగుటూయలలో నవదంపతులను ఉంచి విశేష పదార్థాలను, పలురకాలైన పండ్లను ఉంచి నివేదన గావించి వధూవరులకు ఏకాంత సేవ నిర్వహించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు, కార్యక్రమానికి హాజరైన దంపతులకు దంపతీతాంబూలాలు అందజేశారు. కార్యక్రమం తిలకించేందుకు అధికసంఖ్యలో మహిళాభక్తులు విచ్చేయగా వారికి రవికవస్త్రం అందించారు. వైదిక కార్యక్రమాలను చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి తదితరులు నిర్వహించగా ఆలయకమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.







పూజలు చేస్తున్న పండితులు.. ఊగుటూయలలో స్వామి,అమ్మవార్లు



ఈదరాడలో స్థానికుల చేతిలో హతమైన రక్తపింజరి పాము

7 అడుగుల రక్త పింజరి హతం

మామిడికుదురు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఈదరాడ గుర్రాలబీడు ప్రాంతంలో గురువారం 7 అడుగుల పొడవున్న రక్తపింజరి పామును స్థానికులు కొట్టి చంపారు. 3రోజుల వ్యవధిలో రెండు పాములను హతమార్చామని, ఇటీవల వీటి సంచారం ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎక్కడో కొండ ప్రాంతాల్లో ఉండే ఈ పాములు సుదూర ప్రాంతాల నుంచి లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలించే కంకరతో గ్రామాల్లోకి వచ్చి పదుల సంఖ్యలో పిల్లల్ని పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని పేర్కొంటున్నారు.

రిజర్వేషన్ల శాతం మరింత పెంచాలి

బీసీ ప్రతినిధుల పిలుపు

యానాంలో ఏపీ బీసీ ఫెడరేషన్ సమావేశం

యానాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల శాతాన్ని మరింత పెంచాలని, వెనుకబడిన సామాజికవర్గాలంతా ఐక్యంగా ఉంటూ హక్కుల సాధనకు సమష్టిగా కృషి చేయాలని బీసీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. యానాం కామిశెట్టివారివీధిలోని గీతా మందిరంలో ఆంధ్రపదేశ్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బీసీ సంఘ నేత, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ బీసీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ ప్రతినిధులు రిటైర్డ్ జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ జేఏసీ ప్రతినిధి డాక్టర్ విశారదన్ మహారాజ్ (తెలంగాణ), కుడిపూడి సూర్యనారాయణ, రెడ్డి సుబ్రహ్మణ్యం, పితాని బాలకృష్ణ, ఉభయగోదావరి జిల్లాలకు ముఖ్య బీసీ నాయకులు హాజరయ్యారు. మల్లాడి మాట్లాడుతూ సుమారు 4 గంటలపాటు మేధావులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వలు ఏవిధంగా రిజర్వేషన్లు అమలుచేస్తున్నాయనే అంశాలపై చర్చించామన్నారు. 15రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరిలో ఉన్న ఇబ్బందులను ఈ 3 రాష్ట్రాల ప్రభుత్వాలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి, సంబంధింత కేంద్రశాఖ మంత్రి, అధికారులతో పాటు 3 రాష్ట్రాల్లో ఉన్న ముఖ్యమంత్రులు, గవర్నర్, ఇతర మంత్రులను కలిసి రిజర్వేషన్‌కు సంబంధించిన అంశాలపై వివరిస్తామన్నారు. తమిళనాడు మాదిరిగానే స్థానిక ఎన్నికల్లో 69 శాతం రిజరేషన్‌తో పాటు విద్యాఉద్యోగాల్లో కూడా ఆంధ్రప్రదేశ్‌లో రిజర్వేషన్ సాధించుకోవడానికి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. విడిపోయిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బీసీ, ఎస్సీ,ఎస్టీ సోదరులంతా ఒక్కటై మనకు కావాల్సిన హక్కులన్నీ సాధించుకోవాలని మహారాజ్ అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో రిజర్వేషన్ల శాతాన్ని మరింత పెంచేలా త్వరలో జరిగే రెండో సమావేశంలో సంపూర్ణ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.



సమావేశం పాల్గొన్న బీసీ సంఘాల ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లాడి

విద్యుత్‌షాక్‌తో పారిశుధ్య కార్మికురాలి మృతి

పిఠాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో పారిశుధ్య కార్మికురాలు మరణించిన సంఘటన కాకినాడ జిల్లా పిఠాపురంలో గురువారం జరిగింది. పురపాలకసంఘంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న ముత్యాల రమణమ్మ (55) విధులు ముగించుకుని ఉదయం 11గంటల సమయంలో మంగాయమ్మ రావుపేటలోని తన నివాసానికి చేరుకుంది. ఇల్లు శుభ్రం చేస్తుండగా తడి కర్రకు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పిఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రమణమ్మ (ఫైల్)

30న ఉమ్మడి జిల్లా 'హేతువాద' మహాసభ

అమలాపురం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హేతువాద సంఘం వార్షిక మహాసభ ఈనెల 30న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నల్లవంతెన దిగువన ఉన్న ఎస్టీయూ జిల్లాశాఖ కార్యాలయంలో జరుగుతుందని జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, డి.రాజశేఖర్ తెలిపారు. మహాసభల్లో భాగంగా మేడూరి సత్యనారాయణ రచించిన బౌద్ధం-హేతువాద మానవవాద ఉద్యమం అనే గ్రంథాన్ని తోరాటి వసంతరావు ఆవిష్కరిస్తారని తెలిపారు. మత విశ్వాసాలు-హేతువాదం, మూఢవిశ్వాసాలు-భావవిప్లవం తదితర అంశాలపై హేతువాద సంఘ ప్రముఖుల ఉపన్యాసాలు ఉంటాయన్నారు. అభ్యుదయ భావాలు కలిగిన వారంతా మహాసభలకు హాజరు కావాలని కేవీవీ కోరారు. వివరాలకు 9949691007లో సంప్రదించాలని కోరారు.

గట్టిగా పట్టు.. వలకట్లు పట్టు!

బలుసుతిప్పలో వలకట్ల అత్తరాల (స్థలాలు) కోసం పడవ పోటీలు

కాట్రేనికోన, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం బలుసుతిప్పలో గోదావరిలో వలకట్ల అత్తరాల (స్థలాలు) కోసం గురువారం పడవ పోటీలు జరిగాయి. మత్స్యకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గోదావరికి వరదలు వచ్చినప్పటి నుంచి వరద తగ్గి ఉప్పునీరు వచ్చే వరకు వేట నిలిపివేయడం మత్స్యకారుల కట్టుబాటు. ఉప్పునీరు వచ్చిన తర్వాత బలుసుతిప్ప నుంచి కోటిపల్లి వరకు గోదావరిలో వలకట్ల కోసం సుమారు 100 ఇంజన్ బోట్లతో మత్స్యకారులు పోటీల్లో పాల్గొంటారు. ఎవరైతే పడవ పోటీల్లో గోదావరిలో వలకట్ల స్థలం దక్కించుకుంటారో వారికి మళ్లీ వరదలు వచ్చే వరకు గోదావరిలో ఆ స్థలం కేటాయింపు చేస్తారు. గోదావరిలో ఏ ప్రాంతంలో చేపలు ఎక్కువగా పడతాయో స్థానిక మత్స్యకారులకు అవగాహన ఉంటుంది. గోదావరిలో పడవలో వెళ్లి ఆ ప్రాంతాన్ని దక్కించుకుంటారు. ఏటా దీపావళి అనంతరం ఈ పోటీలు నిర్వహిస్తారు. దీంతో ప్రస్తుతం జరిగిన ఈ పడవ పోటీలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకున్నాయి.







గోదావరిలో పడవ పోటీల్లో పాల్గొన్న మత్స్యకారులు

వృద్ధురాలిపై అత్యాచారం.. నిందితుడికి ఏడేళ్ల జైలు

కరప, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 80 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారానికి ఒడిగట్టిన నిందితుడికి న్యాయస్థానం ఏడేళ్ల జైలు శిక్ష విధించినట్టు కరప ఎస్‌ఐ తోట సునీత తెలిపారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన ఒక వృద్ధురాలిపై గతేడాది ఆగస్టు 29వ తేదీ రాత్రి అదే గ్రామానికి చెందిన నొక్కు వెంకటరమణ అనే వ్యక్తి అత్యాచారం చేశాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. సాక్షుల విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి వై.బెన్నయ్య నాయుడు తీర్పును వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ కనుమూరి రాధాకృష్ణరాజు ఈ కేసును వాదించారు.

జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఖైదీ మృతి

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఖైదీ మెట్టు భాస్కరరెడ్డి (53) మృతిచెందాడు. 3 దశాబ్దాల క్రితం జరిగిన బాబాయి, కుమారుడు హత్య కేసుల్లో భాస్కరరెడ్డి నిందితుడిగా ఉన్నాడు. నేరం రుజువు కావడంతో గత ఐదేళ్ల నుంచి రాజమహేంద్రవరం కేంద్ర కార్యాలయంలో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ ఏడాది ఆగస్టు 31 అనారోగ్యం పాలవ్వడంతో తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఎస్కార్ట్ సిబ్బందితో కాకినాడ జీజీహెచ్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. అనారోగ్య పరిస్థితి విషమించడం, ఊపిరితిత్తుల సమస్యతో ఖైదీ ఆరోగ్యం విషమించి బుధవారం మధ్యాహ్నం మరణించినట్టు వైద్యులు తెలిపారు.

మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల గ్యాంగ్ సంచారం

అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే తక్షణం పోలీసులకు సమాచారమివ్వాలి

కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల బ్యాచ్ దువ్వాడ-స్టీల్ ప్లాంట్ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు సమాచారం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని... కాకినాడ జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే తక్షణం డయల్ 100, 111 నెంబర్లకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఓ ప్రకటనలో కోరారు. బుధవారం రాత్రి ఈ దొంగల బ్యాచ్ స్టీల్‌ప్లాంట్ ప్రాంతాల్లో తిరిగారని అనకాపల్లి మీదుగా కాకినాడ జిల్లాలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందన్నారు. అనుమానాస్పదంగా వాహనాలు తిరిగినా, వ్యక్తులు సంచరిస్తున్నా తక్షణం సెక్యూరిటీ, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేయాలన్నారు. ఇళ్లను లాక్ చేసి బయటకు వెళ్లేవారు ఎల్‌హెచ్‌ఎంఎస్‌ని వినియోగించుకోవాలని కోరారు. రాత్రి పూట ఇంటి భద్రతా చర్యల్లో భాగంగా ప్రధాన తాళాలు, గేట్లు, గ్రిల్స్ బిగించి ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలన్నారు. ఇంటి బయట ఉన్న సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో పర్యవేక్షించుకోవాలన్నారు. ముందస్తు భద్రత చర్యలు తీసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.

పుట్టినరోజు వేడుకలో వాగ్వాదం

కుప్పకూలి వ్యక్తి మృతి

తాటిపర్తిలో ఘటన

గొల్లప్రోలు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో గురువారం రాత్రి జరిగిన వాగ్వాదంలో ఒక వ్యక్తి కుప్పకూలి మరణించాడు. గ్రామానికి చెందిన శ్రీమంతుల దయ మనుమరాలు పుట్టినరోజు వేడుక చేస్తూ రోడ్డుకు అడ్డంగా బల్లలు పెట్టారు. అదే సమయంలో వెంపల సూరిబాబు కోడలు కృష్ణవేణి అటుగా వెళ్తూ బల్లకు తగులుకోవడంతో బల్ల పడిపోయింది. దీంతో రెండు కుటుంబాల మధ్య వివాదం జరిగి వాగ్వాదానికి దారితీసింది. ఒకరిపై ఒకరు పెద్దగా కేకలు వేసుకుంటున్న సమయంలో వెంపల సూరిబాబు (59) ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. అతడిని పిఠాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మరణించిన సూరిబాబు

కాకినాడలో విస్తృతంగా తనిఖీలు

కాకినాడ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో గురువారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కాకినాడ ఆర్టీసీ బస్ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, పార్కుల్లో పోలీసు బాంబు స్క్వాడ్ బృందం సభ్యులు రామకృష్ణ, మణికంఠ, డాగ్ హ్యాండ్లర్ శ్రీనివాస్, డాగ్ మ్యాక్స్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేశారు.

సంతకు వెళ్లొస్తుండగా...

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో

మహిళ మృతి

ముగ్గురికి గాయాలు

ఆటోడ్రైవర్ పరిస్థితి విషమం

చింతూరు, మోతుగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో మహిళ మృతిచెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. చింతూరు మండలం మోతుగూడెం పోలీసుస్టేషను పరిధిలోని సుకుమామిడి సమీపంలో ఈ ఘటన జరిగింది. మోతుగూడెం ఎస్‌ఐ సాదిక్ కథనం మేరకు.. మోతుగూడెనికి చెందిన చిరు వ్యాపారులు ప్రతీ గురువారం సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గడ్‌లోని కుంటలో జరిగే వారాంతపు సంతకు వెళ్లి తిరిగి సాయంత్రం ఆటోలో మోతుగూడెం చేరుకుంటారు. గురువారం సంత ముగించుకుని తిరిగి మోతుగూడెం వస్తుండగా సుకుమామిడి సమీపంలో ఓ ట్రాక్టర్‌ను వెనుకవైపు నుంచి ఆటో ఢీకొంది. ఆటోలో ముగ్గురు ప్రయాణికులు, డ్రైవర్ రాము తీవ్రంగా గాయపడ్డారు. చింతూరు ఆసుపత్రికి తరలించగా వారిలో వేగి మంగ (50) మృతిచెందింది. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో భద్రాచలం తరలించారని ఎస్‌ఐ తెలిపారు.



మరణించిన మంగ



ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్‌గా భాగ్యశ్రీని ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

పుంత రోడ్ల ఆధునికీకరణకు చర్యలు

● ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్‌గా ఓగూరి భాగ్యశ్రీ ప్రమాణ స్వీకారం

ముమ్మిడివరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులకు ఉపాధిహామీ పథకం నిధులు అనుసంధానం చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పుంత రోడ్ల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటామని ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుచ్చిబాబు మాట్లాడుతూ మార్కెట్ కమిటీలు రైతులకు ఉపయోగపడే విధంగా పనిచేయాలని సూచించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ తన తండ్రి దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి హయాంలో ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి పథంలో పయనించిందన్నారు. మార్కెట్ కమిటీకి అవసరమైన గోడౌన్ల నిర్మాణం, భవనాలు నిర్మించి అభివృద్ధికి బాలయోగి ఎంతో కృషి చేశారన్నారు.

ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జనసేనపార్టీకి చెందిన ఓగూరి భాగ్యశ్రీ ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా బీజేపీకి చెందిన గొలకోటి వెంకటరెడ్డి, డైరెక్టర్లుగా కొప్పిశెట్టి దుర్గాగణేశ్వరరావు, పోతాబత్తుల కుమారి, వీపూరి వెంకటనాగరాజువర్మ, ఉద్దిశ సత్యనారాయణ, కాళ్ల సత్యతులసిగాయత్రి, కోలా బ్రహ్మానందం, గొల్లపల్లి గంగాభవానీ, గోకవరపు శ్రీశేషసాయి నాగవెంకటరమా, బండారు గౌరీదేవి, పెచ్చెట్టి శ్రీలక్ష్మి, మట్టా బాలసూర్యసుబ్రహ్మణ్యేశ్వరరావు, కంపసత్తి చిన్ని, ఆకెళ్ల వెంకట శ్రీనివాసనగేశ్వరరావు, సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. హానరబుల్ చైర్మన్‌గా ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, మాజీఎమ్మెల్యే చెల్లి వివేకానంద, కొత్తపేట జనసేనపార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు, నాయకులు నాగిడి నాగేశ్వరరావు, తాడి నరసింహారావు, గొలకోటి దొరబాబు, గుద్దటి జమ్మీ, అర్ధాని శ్రీనివాసరావు, సాగిరాజు సూరిబాబురాజు, మందాల గంగసూర్యనారాయణ, నడింపల్లి సుబ్బరాజు, కాకర్లపూడి రాజేష్, దూడల స్వామి, గోదశి పుండరీష్, దూళిపూడి చక్రం, రంబాల రమేష్, బీర సత్యకుమారి, లంకలపల్లి మునిరాజు, చోడిశెట్టి నాగబాబు, పెంట రవిప్రసాద్, దాట్లబాబు, పొద్దోకు బాలు, చెల్లి అశోక్, ముత్యాల జయలక్ష్మితో పాటు అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గోతులమయంగా రహదారి

● ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల రోడ్డుపై ప్రయాణం నరకమే



అధ్వానంగా సన్నవిల్లి- ఉప్పూడి రహదారి (ఫైల్)

ఉప్పలగుప్తం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాలను కలిపే ఆ రహదారిపై ఇప్పుడు ప్రయాణించాలంటే నరకయాతనే. అందుకే ఈ రహదారిపై ప్రస్తుతం ప్రయాణాలు చాలావరకు నిలిచిపోయాయి. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి ఓఎన్జీసీ సెంటర్ నుంచి కాట్రేనికోన మండలం ఉప్పూడి వరకు 7 కి.మీ మేర సన్నవిల్లి- ఉప్పూడి రహదారిని టీడీపీ హయాంలో 2016లో ఆధునికీకరించారు. ఈ రహదారిలో కొంతమేరకు టెర్రాజియం టెక్నాలజీనీ వినియోగించారు. అప్పట్లో ఈ రహదారి ప్రత్యేకతపై ప్రజలు వింతగా మాట్లాడుకునేవారు. ఈ రహదారి ఆధునికీకరణతో రెండు మండలాల మధ్య ట్రాఫిక్ పెరిగింది. కాట్రేనికోన మండలంలోని ఎక్కువ గ్రామాల ప్రజలకు అమలాపురం వెళ్లాలంటే ఈ రహదారి అడ్డదారి. పల్లంకుర్రు-అమలాపురం రహదారిలో ప్రయాణం కంటె ఈ రహదారి మూడు కిలోమీటర్ల వరకు కలిసివస్తోంది. ఈ కారణంగా ఈ రహదారి నిత్యం రద్దీగా ఉండేది. ఉప్పలగుప్తం మండలంలోని గ్రామాలతోపాటు కాట్రేనికోన మండలంలోని లక్ష్మీవాడ, పెనుమెల్ల, బంటుమిల్లి, ఉప్పూడి, కాట్రేనికోన, దొంతికుర్రు, నడవపల్లి, కొప్పిగుంట, కందికుప్పతోపాటు తీర గ్రామాలైన పల్లం, బలుసుతిప్ప, చిర్రయానాం, గచ్చకాయలపొర, కొత్తపాలెం తదితర గ్రామాల ప్రజలకు ఈ దారి ఎంతో ప్రయోజనకరం. అయితే ఈ రహదారి అధిక వర్షాల కారణంగా 2024 నాటికి కొన్నిచోట్ల గోతులు పడింది. వైసీపీ హయాంలో ఈ రహదారిని పట్టించుకోలేదు. వర్షం నీరు గోతుల్లో చేరి క్రమంగా 7 కిమీ మేర రహదారి పూర్తిగా పాడయ్యింది. రహదారి గోతులమయం కావడంతో ప్రయాణికులు ఈ రహదారిని పూర్తిగా విడిచిపెట్టారు. ఈ కారణంగా రహదారి శిథిలస్థితికి చేరింది. ఈ రహదారిని ఆధునికీకరించాలని రెండు మండలాల ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. టీడీపీ హయాంలో వేసిన రహదారి కూటమి పాలనలోనే అభివృద్ధికి నోచుకుంటుందని ప్రజలు ఆశిస్తున్నారు.

ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలి

● జిల్లా రవాణాశాఖాధికారి శ్రీనివాసరావు



డ్రైవర్ల శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖాధికారి శ్రీనివాసరావు

అమలాపురంరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ వృత్తి అత్యంత బాధ్యతాయుతమైనదని, డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రతను కోల్పోరాదని జిల్లా రవాణాశాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం అమలాపురం ఏపీఎస్ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న హెవీ డ్రైవింగ్ స్కూలులో 16 మంది అభ్యర్థులతో 12వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. డ్రైవర్లు అంటే కదిలే దేవుళ్లు అని వారి చేతిలో ఎంతోమంది ప్రాణాలు ఉంటాయని మెళకువతో మానసిక ప్రశాంతతో డ్రైవింగ్ చేయాలన్నారు. డ్రైవింగ్ విధానంపై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ప్రజారవాణాధికారి ఎస్టీపీ రాఘవకుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ శిక్షణా కళాశాలలో డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతోపాటు బస్సు మెయింటెనెన్స్‌పై పూర్తి అవగాహన కల్పిస్తారన్నారు. డిపో మేనేజర్ బీఎల్ఎన్ శర్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎ.సత్యవతి చేతులమీదుగా డ్రైవింగ్ అభ్యర్థులకు డ్రైవింగ్ శిక్షణ, పాఠ్య పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో గ్యారేజీ ఇన్‌చార్జి జీఆర్ఎల్ దేవి, ట్రాఫిక్ ఇన్‌చార్జి ప్రతిమా కుమారి, ఓపీఆర్ఎస్ ఎస్.వరహాలబాబు, డిపో సిబ్బంది పాల్గొన్నారు. త్వరలో 13వ బ్యాచ్ శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని, ఆసక్తి గల అభ్యర్థులు డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఎండీ రజాక్ సెల్ 7382909586ను సంప్రదించాలన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం అండ

● ఎంపీ హరీష్‌మాధుర్

ముమ్మిడివరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు దైనందిన జీవితంలో ముందుడుగు వేసేలా మనోధైర్యం నింపేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు జనసేన పార్టీ కోనసీమ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్‌తో కలసి గురువారం ముమ్మిడివరం నియోజకవర్గంలో గుర్తించిన 386 మంది దివ్యాంగులకు 832 రకాలైన చార్జింగ్ ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్, బ్రెయిలీకిట్లు, ట్రైసైకిళ్లు తదితర 25 రకాల ఉపకరణాలను ఎంపీ హరీష్‌బాలయోగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీచైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, దూడల స్వామి, గోదశి పుండరీష్, దాట్ల బాబు, గొలకోటి వెంకటరెడ్డి, చిక్కాల అంజిబాబు, చిక్కం శ్రీనివాస్, బద్రి రమాలతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేసి మాట్లాడుతున్న ఎంపీ హరీష్

భవిత సెంటర్ సేవలను వినియోగించుకోవాలి

● జిల్లా సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సుబ్రహ్మణ్యం

పి.గన్నవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): భవిత సెంటర్‌లలో విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక సేవలు, అలవెన్స్‌లను విద్యార్థుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి టీవీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. పి.గన్నవరం హైస్కూల్ ఆవరణలో ఉన్న భవిత సెం టర్‌ను గురువారం ఆయన తనిఖీచేసి అనంతరం మాట్లాడారు. ప్రతి విద్యార్థికి భవిత సెంటర్ ద్వారా అందించే అన్నిసేవలు విధిగా అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం చిన్నారులకు జరుగుతున్న ఫిజియోథెరపీ క్యాంపును ఆయన పరిశీలించారు. సహిత విద్యా సంబంధిత సేవలను, రికార్డులను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో-2 సిహెచ్ వీరభద్రానందం, భవిత సెంటర్ సిబ్బంది ఉన్నారు.



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న జిల్లా సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సుబ్రహ్మణ్యం



మామిడికుదురులో మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న మాక్ అసెంబ్లీ

● ప్రజాప్రతినిధులుగా వ్యవహరించిన విద్యార్థులు

మామిడికుదురు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రజాప్రతినిధులు వ్యవహరించి ఆకట్టుకున్నారు. హైస్కూలులో గురువారం ప్రధానోపాధ్యాయుడు బందా చిరంజీవిరావు అధ్యక్షతన మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ అసెంబ్లీలో విద్యార్థిని చింతలపూడి అలివేలు స్పీకర్‌గా వ్యవహరించగా ఆరు ప్రధాన శాఖలకు చెందిన మంత్రులుగా ఎమ్మెల్యేలు ప్రశ్నలు అడగడం మంత్రులు సమాధానం చెప్పడం అచ్చం అసెంబ్లీ సమావేశాలను తలపించేలా ఉంది. స్కూలు విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించి ఔరా అనిపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విద్యార్థినీ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు సూచించారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు పాల్గొని వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి గెలుపొందిన చొల్లంగి నవ్యకమలశ్రీ, రెండవ బహుమతి పొందిన కొమ్ముల సూర్యశ్రావణి, మూడో బహుమతి పొందిన కొనుకు సిరివెన్నెలకు నగదు ప్రోత్సాహకాలతో పాటు షీల్డులు అందించి మరో ఆరుగురికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లాశాఖ అధ్యక్షుడు బత్తుల నకులరాజు, మండలశాఖ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్‌బాబు, ప్రధాన కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, గెడ్డం భాస్కర్, బత్తుల రమేష్‌బాబు, భూపతి మనోహర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవ క్విజ్ పోటీలో తొండవరం విద్యార్థి ప్రతిభ

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలకు నిర్వహించిన క్విజ్ పోటీలలో తొండవరం హైస్కూల్‌కు చెందిన పెదమల్లు శ్రీమనస్విని జిల్లాలో రెండవస్థానం సాధించినట్లు హెచ్ఎం పీవీ కేశవచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా చేతులు మీదుగా జ్ఞాపిక ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థినిని సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, విద్యాకమిటీ చైర్మన్ పేరాబత్తుల వెంకటసుబ్బారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన అవసరం

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండడం ఎంతో ఆవశ్యకత అని అడ్వకేట్ పెనుమాల సుధీర్ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని డాక్టర్ మోకా గణపతిరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం దీవెన ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు రాజ్యాంగంపై ఇటీవల పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచిన విజేతలకు సుధీర్ బహుమతులు అందజేశారు. భారతరత్న అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దీవెన వ్యవస్థాపక అధ్యక్షుడు గుమ్మళ్ల శ్రీనివాస్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, అధ్యాపకులు భానుప్రకాష్, దుర్గాప్రసాద్, చందు, రామరాజులతో పాటు శరత్, ప్రసాద్, కవిలతో పాటు పలువురు పాల్గొన్నారు.



తొండవరానికి చెందిన విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న జేసీ, డీఈవో



వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

నేటి నుంచి హనుమద్వ్రత పూజా మహోత్సవాలు

అమలాపురంటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని యర్రమిల్లివారి వీధిలో ఈ నెల 28 నుంచి హనుమద్వ్రత పూజా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు ఆకొండి పవన్‌కుమార్ తెలిపారు. డిసెంబరు 2 వరకు ఈ మహోత్సవాలు జరుగుతాయన్నారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలు, సత్సంగాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా సంస్కృతిక ఉత్సవ్-2025 పేరుతో విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆయా పోటీల విజేతలకు బహుమతులు అందజేయడంతోపాటు ప్రముఖుల సమక్షంలో సత్కరిస్తామని పవన్‌కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు సెల్ 9885450524ను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం సబ్‌స్టేషన్ పరిధిలోని నగరం, తాటిపాక సెంటర్‌లో మొగలికుదురు, పెదపట్నం, అప్పనపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాట్రేనికోన(ఆంధ్రజ్యోతి): ఈ నెల 28వ తేదీన పల్లంకుర్రు విద్యుత్ సబ్ స్టేషన్‌కు టవర్ లైన్స్ వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కారణంగా శుక్రవారం కాట్రేనికోన సబ్‌స్టేషన్ పరిధిలోని కాట్రేనికోన, దొంతికుర్రు, కొప్పిగుంట, కందికుప్ప, పల్లంకుర్రు, గెద్దనపల్లి, నడవపల్లి, కుండలేశ్వరం, పల్లం గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ తెలిపారు.

నత్రజని వాడకం తగ్గించాలి

ఉప్పలగుప్తం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వరిసాగులో నత్రజని వాడకం తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్త నందకిశోర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. గురువారం భీమనపల్లి పంచాయతీ సింగరాయపాలెంలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. సార్వా కోతల అనంతరం చేలల్లో డీకంపోస్ట్ వాడటం వల్ల వరి దుబ్బులు తొందరగా కుళ్ళి దాళ్వా పంటకు ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయాధికారి గుత్తుల కుమార్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏడీ రాజశేఖర్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

● సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే దేవ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ప్రతీఒక్కరూ పనిచేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతీ అధికారితో రివ్యూ నిర్వహించి గ్రామాల్లో సమస్యలు తెలుసుకుంటూ అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, వెటర్నరీ తదితర శాఖల అధికారులతో మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ఎక్కడైతే ఓవర్‌హెడ్, సింటెక్స్ ట్యాంకులు అవసరమవుతాయో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అంతర్వేది దేవస్థానంలో రూ.17 కోట్లతో నిర్మించిన మంచినీటి చెరువును లక్ష్మీనరసింహస్వామివారి తీర్థ మహోత్సవాల ముందు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే దేవ తెలిపారు. అలాగే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసి లోఓల్టేజ్ సమస్యను తీర్చాలన్నారు. రోడ్లు, పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. 2025-26 సవరణ బిల్లు, 2026-27 అంచనా బడ్జెట్‌ను రూపొందించినట్టు ఎంపీడీవో పీఆర్సీ రాజ్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యతోపాటు ఇతర రంగాల్లో రాణించాలి

● డీఈవో సలీంబాషా



ఈదరాడ హైస్కూలులో ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న సలీంబాషా

మామిడికుదురు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు ఇతర రంగాల్లో రాణించాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా కోరారు. ఈదరాడ హైస్కూలులో క్రాఫ్ట్ ఆర్ట్ డ్రాయింగ్ ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా ప్రదర్శనను డీఈవో ప్రారంభించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యలోనే కాకుండా ఇతర అంశాల్లో ప్రావీణ్యం గడించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు రూపొందించిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మీ, సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, డీవైఈవో జి.సూర్యప్రకాశం, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, హెచ్ఎం జి.సాయిబాబా, చిత్రలేఖన ఉపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

అంబాజీపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం పరామర్శించారు. అంబాజీపేట జయంతి నగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త పరమట ఏసురత్నం ఇటీవల బండారులంకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి ఏసురత్నం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పుల్లేటికుర్రులో బొరుసు వీర నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, నాయకులు దొమ్మేటి సాయికృష్ణ, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, వాసంశెట్టి కుమార్, వంగా చిన్న, తదితరులు పాల్గొన్నారు



పుల్లేటికుర్రులో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మాధురికి రజిత పతకం



ఆమర్తి మాధురి ఇందుప్రియ

అమలాపురంటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అమలాపురం పవర్‌కిక్ కరాటే స్కూలు విద్యార్థిని పామర్తి మాధురిఇందుప్రియ అద్భుత ప్రతిభచాటి రాష్ట్రస్థాయిలో రజత పతకాన్ని దక్కించుకుంది. అండర్-14 కేటగిరిలో 50 కిలోల బాలికల విభాగంలో మాధురి రజిత పతకం సాధించినట్టు చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఇంద్రజకు పతకం



రాజోలు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూలుగేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా మోరి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో శివకోడు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పి.ఇంద్రజ కాంస్య పతకం సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా శివకోడులో గురువారం విలేఖరులతో మాట్లాడుతూ అండర్-17 విభాగం నుంచి టీమ్ ఈవెంట్ భాగంలో కాంస్య పతకం సాధించిందని తెలిపారు. విద్యార్థి ఇంద్రజను సర్పంచ్ నక్కా రామారావు, పీఎంసీ చైర్మన్ అప్పారి దుర్గాభవానీ, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉండ్రు సూర్యారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.54,099 విరాళం



విరాళం ఇచ్చిన భక్తులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఉద్యోగి

మామిడికుదురు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి మద్దుల సుబ్బారావు-స్వర్ణలత దంపతులు రూ.54,099 విరాళంగా అందించారు. విరాళమందించిన భక్తులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనంచేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఉద్యోగులు స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందించి అభినందించారు.

ఏఎఫ్‌డీటీ కళాశాలకు విరాళం

మలికిపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఏఎఫ్‌డీటీ కళాశాలకు కెనరా బ్యాంకు సీఎస్సార్ నిధుల నుంచి రూ.10లక్షలను ఆ బ్యాంకు ఎండీ కలిదిండి సత్యనారాయణరాజు మంజూరు చేశారని లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఆర్.గోపాలకృష్ణరాజు గురువారం తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు ఉపయోగపడే కంప్యూటర్స్, జనరేటర్లు, వాటర్ ప్లాంటు తదితర సామగ్రి ఏర్పాటుకు ఈ నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ నిధులను సీఎస్సార్ నిధుల నుంచి మంజూరు చేసినందుకు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ సమావేశం

మలికిపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మలికిపురం పూలే అంబేడ్కర్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా నూతన అధ్యక్షుడిని నియమించడానికి కార్యకర్తల అభిప్రాయం తెలుసుకోవడానికి గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి అఖిలభారత కాంగ్రెస్ జాతీయ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు ఏఐసీసీ అబ్బర్వర్ ముఖ్యఅతిథిగా వచ్చారు. ఆయన సమక్షంలో కార్యకర్తల అభిప్రాయాలను స్వీకరించారు. కార్యక్రమానికి అమలాపురం పార్లమెంటు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి జంగా గౌతమ్ అధ్యక్షత వహించగా ఆర్.గోపాలకృష్ణరాజు, దేశినీడి భాస్కరరావు, మధురాజు, ఎం.రాంబాబు, ఎ.అరుణ, సరెళ్ల ప్రసన్నకుమార్, సీహెచ్ శ్రీధర్, తోటే ప్రతాప్, అప్పారి శ్రీను, పి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు కూటమి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆలమూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం సందిపూడిలో నిర్మించనున్న కల్యాణ మండపానికి శంకుస్థాపనతో పాటు, రూ.43లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం ప్రారంభోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఎంపీడీవో ఎ.రాజు, సర్పంచ్ తోట భవానీ, ఎంపీడీవో తేలేటి సంతోషి, నాయకులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు, సూరపురెడ్డి సత్య, సంగిత సుబాష్, మెర్ల గోపాలస్వామి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



సందిపూడిలో కల్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆర్టీసీ బస్టాండులో ఆర్వో ప్లాంట్



ఆర్టీసీ బస్టాండులో ఆర్వో ప్లాంటును ప్రారంభిస్తున్న డీపీటీవో

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురానికి చెందిన మోతీ జ్యూవెలర్స్ అధినేత దివంగా మోతీలాల్ జైన్ స్మృతికి అంకితంగా ఆయన కుటుంబ సభ్యులు ఆర్టీసీ బస్టాండులో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. మోతీలాల్ భార్య కుసుమ జైన్, కుమారులు సంజయ్ జైన్, చంద్రిక జైన్, హితేష్ జైన్, వాణి జైన్, మనుమడు దర్శ జైన్, కుమార్తె షీతల్ జైన్, విక్రమ్ జైన్‌లు రూ.5 లక్షల విలువైన ఆర్వో ప్లాంటు ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేశారు. దీన్ని జిల్లా డీపీటీవో రాఘవకుమార్ ప్రారంభించారు. మోతీలాల్ కుటుంబ సభ్యులను డిపో మేనేజరు పేపకాయల భాస్కర్‌రావు అభినందించారు.

రేపు జాబ్‌మేళా

కొత్తపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 29న కొత్తపేట కాపు కల్యాణ మండపంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు సంస్థ అధికారి డి.హరిశేషు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 11 కంపెనీలు పాల్గొంటాయని నిరుద్యోగ యువతీ యువకులు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పీజీ ఉత్తీర్ణత సాధించిన యువకులు జాబ్‌మేళాలో పాల్గొనాలన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే విద్యార్థులు బయోడేటా, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలని నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు కోరారు.

30న లొల్లలో భగవద్గీత పోటీలు

రాయవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): లొల్లలోని విశ్వమానవత ఆశ్రమంలో 30న విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించనున్నట్లు ఆశ్రమం వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాసచౌదరి తెలిపారు. గురువారంలో లొల్లలో మాట్లాడుతూ విద్యార్థులకు గీతా శ్లోకాలపై పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్‌లో పాల్గొనవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 99666 73111 ఫోన్‌లో లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ, మానవతా డాట్ ఓఆర్‌జీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

ఆత్రేయపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ అర్జీలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆయా సమస్యలను అధికార యంత్రాంగం సమక్షంలో పరిష్కరించనున్నారు.

ఎండుగడ్డికి పెరిగిన డిమాండ్

• రూ.80 పైబడి పలుకుతున్న కట్టగడ్డి • హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



ఆలమూరు మండలంలో వరిగడ్డిని ట్రాక్టర్‌పైకి లోడు చేస్తున్న దృశ్యం

ఆలమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు క్రిమిసంహారక మందులు తక్కువగా ఉపయోగించడం వల్ల ఏడాది పొడవునా నిల్వ చేయడానికి ఖరీఫ్ సీజన్‌లో వచ్చే గడ్డికి రైతులు ఆసక్తి చూపిస్తారు. దీంతో ప్రస్తుతం ఎండు గడ్డికి భలే డిమాండ్ వచ్చి పడింది. గతంలో కోతలు కోసి కుప్పలు వేసి ట్రాక్టర్ల ద్వారా తొక్కించడం ద్వారా వచ్చిన ఎండుగడ్డిని ఏడాది పొడవునా పశువులకు ఉపయోగపడేలా గడ్డి మేట్లు వేసి నిల్వ చేసేవారు. ప్రస్తుతం ఈ పద్ధతి తెరమరుగైపోయింది. ప్రస్తుతం యంత్రాల ద్వారా వరికోతలు జరుగుతున్నాయి. దీంతో వరిగడ్డి నాణ్యత దెబ్బతినడంతో పాటు పశువులకు వేయడానికి మరో మార్గం లేక దీన్నే ఉపయోగించాల్సిన పరిస్థితి నెలకొంది.

కట్ట ఎండుగడ్డి రూ.80పైనే: ఎండుగడ్డిని కట్టలు కట్టి పశువుల మకాం వద్దకు తీసుకురావడానికి రూ.80 పైబడి ధర పలుకుతోంది. వరికోత అనంతరం ఎండుగడ్డిని కట్టలు కట్టడానికి కట్టకు రూ.35 చార్జి చేస్తున్నారు. వాటిని ట్రాక్టర్‌పై వేసి పశువుల మకాం దగ్గరకు తీసుకురావడానికి మొత్తం ఖర్చు రూ.80 వరకు పడుతుందని రైతులంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే స్వర్ణ వరి రకానికి డిమాండ్ ఉంటుంది. దీంతో స్వర్ణ రకం గడ్డిని ఎకరానికి రూ.1000 నుంచి 1500 వరకు రైతుకు చెల్లించి తీసుకెళుతున్నారు. మిగిలిన రకాలకు అంతగా డిమాండ్ లేకపోవడంతో రూ.500 చెల్లిస్తున్నారు.

పశుపోషకులకు భారంగా మారిన ఎండుగడ్డి: పశుపోషకులకు ఎండుగడ్డి భారంగా మారిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏడాది పొడవునా దీన్ని పశువులకు వేయడానికి అవసరం కావడంతో దీన్ని నిల్వ చేసి సంవత్సరం పాటు ఉపయోగించాల్సి వస్తోందని రైతులంటున్నారు. గతంలో కోతల ద్వారా వచ్చిన గడ్డిని నేరుగా గడ్డిమేటు వేసి నిల్వ చేసేవారని గుమ్మిలేరుకు చెందిన పశుపోషకులు రెడ్డి సత్తిబాబు అన్నారు.





రాయవరంలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు. పక్క చిత్రంలో మండపేట మండలం ఏడిదలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటున్న కూటమి నేతలు

'తూర్పు'లో విలీనం చేయడంపై హర్షాతిరేకాలు

రాయవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేస్తానని ప్రజలకు ఇచ్చిన మాటను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు నిలబెట్టుకున్నారని తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రిమ్మలపూడి వేణుగోపాలదొర అన్నారు. గురువారం రాయవరంలో టీడీపీ మండల స్థాయిలో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ సీనియర్‌నేత ఉండవిల్లి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేణుగోపాలదొర మాట్లాడుతూ గత ప్రభుత్వం హేతుబద్ధత లేకుండా మండపేటను కోనసీమ జిల్లాలో కలిపిందన్నారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం అర్థం చేసుకుందన్నారు. తొలుత రాయవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. అనంతరం బాణసంచా కాల్చి , స్వీట్స్ పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. రాయవరంలో జరిగిన కార్యక్రమంలో రామచంద్రపురం వాటర్ డీసీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సతీష్‌రెడ్డి, సహకార సంఘాల త్రిసభ్య కమిటీ చైర్మన్‌లు పిల్లి గణేష్, సత్తి వెంకట కృష్ణారెడ్డి, మేడపాటి రవీంద్రారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు, దేవిశెట్టి చిన్ని, దొంతంశెట్టి బాల కేదారీశ్వరుడు, కొవ్వూరి భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెదురుపాక పంచాయతీ వద్ద: మండలంలోని వెదురుపాక పంచాయతీ కార్యాలయం వద్ద కూటమి నాయకులు స్వీట్స్ పంచిపెట్టి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకోవడంతో పాటు ఎమ్మెల్యే వేగుళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు కె.శ్రీదేవి, కొవ్వూరి చంటిరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, కటారి రామకృష్ణ, వాసంశెట్టి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం చేస్తాం

మండపేట, (ఆంధ్రజ్యోతి): మండపేటను తూర్పుగోదావరి జిల్లాలో కలప డంపై ఆయా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అఖిలపక్షం అధ్వర్యంలో చేసిన పోరా టంతో పాటు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు జరిపిన కృషి ఫలించటంతో ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, అఖిలపక్ష నేతలు సంతోషాన్ని వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. గెజిట్ నోటిఫికేషన్ వెలు వడిన వెంటనే ఎమ్మెల్యేకు పౌర సన్మానం చేస్తామని అఖిలపక్ష నేతలు తెలిపారు. విలీనం కోసం పోరాడిన అఖిలపక్ష నేతలను సత్కరిస్తామని నిర్వాహకులు తెలిపారు. గురువారం ఏడిదలో జరిగిన సమావేశంలో అఖిలపక్ష నాయకులు జేఏసీ సభ్యులు దూళి జయరాజు, కోనా సత్యనారాయణ, వాదా ప్రసాదరావు గుండు వీర తాతరాజు, కుచ్చు బాబి, చిన్న, పువ్వలపల్లి రాజా వేమగిరి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వీట్స్ పంపిణీ: మండలంలోని పాలతోడు, వెలగతోడు, ఏడిద, అర్తమూరు, చినద్వారపూడి తదితర గ్రామాల్లో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే వేగుళ్ల చిత్రపటాలకు కూటమి నేతలు, స్థానికులు పార్టీలకు అతీతంగా పాలాభిషేకం చేసి బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు.

తాపేశ్వరంలో కూటమి నాయకుల సంబరాలు: మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపడం పట్ల తాపేశ్వరంలో గురువారం రాత్రి కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే వేగుళ్ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీకి చెందిన భట్టాచార్య కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం అందజేస్తున్న దృశ్యం

మందపల్లి ఆలయంలో కేంద్ర అటవీశాఖ డిప్యూటీ సెక్రటరీ పూజలు

కొత్తపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామిని గురువారం ఢిల్లీకి చెందిన కేంద్ర పర్యావరణ అటవీశాఖ డిప్యూటీ కార్యదర్శి కేకే అనురూప్ భట్టాచార్య ఆలయానికి వచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనరు దారపురెడ్డి సురేష్ బాబు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ఐలూరి శ్రీరామమూర్తి, వేదపండితులు భట్టాచార్య కుటుంబ సభ్యులకు స్వామివారి శేషవస్త్రం, చిత్రపటాన్ని అందించారు. అనంతరం వేదాశీర్వచనం అందుకున్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ చింతం విజయ కృష్ణమోహన్, పాలక మండలి సభ్యులు చిలకమర్తి శ్రీనివాస్, ఏవో మాచిరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలి ఆలయంలో పూజలు

ఆత్రేయపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో గురువారం కేంద్ర అటవీశాఖ డిప్యూటీ సెక్రటరీ ఏకే అనురూప్ భట్టాచార్య కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి వారికి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రంతో పాటు ప్రసాదాన్ని అందజేశారు.

కిటకిటలాడిన వాడపల్లి వెంకన్న ఆలయం

ఆత్రేయపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం, నివేదన, గోపూజ, స్వామివారి కల్యాణం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ ఎస్ఆర్ నగర్‌కు చెందిన ఆవాల వెంకటసుబ్బారావు కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం అందజేశారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదం అందజేశారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



విరాళం అందజేసిన దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

రైతులకు కూటమి ప్రభుత్వం అండ

ఆలమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సుకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సందిపూడిలో గురువారం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులను కలిసి ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, కూటమినాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు పరామర్శ

మండపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుకు గురై మరణించిన మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ కుటుంబ సభ్యులను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కూటమి నేతలు గురువారం పరామర్శించారు. తొలుత ప్రకాష్ చిత్రపటానికి వారు నివాళులర్పించారు. అతని తండ్రి గోవిందరాజును పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నేతలు ఈదల సత్తిబాబు, వెచ్చా సుబ్బారావు, ఒంటిపల్లి సతీష్ తదితరులు వున్నారు.



మండపేటలో ప్రకాష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు

అభ్యాసన సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి

రాయవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పిల్లి రాంబాబు సూచించారు. గురువారం వి.సావరం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఏఎంవో పరిశీలించారు. ఏఎంవో మాట్లాడుతూ ఒకటి, రెండోవ తరగతుల్లో అభ్యాసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు గ్యారెంటెడ్ ఎఫ్ఎల్ఎన్ సర్వే నిర్వహిస్తామన్నారు. సర్వేలో భాగంగా 1నుంచి 5 తరగతి వరకు ప్రతి విద్యార్థి లీప్ యాప్ సాయంతో ఆన్‌లైన్‌లో వచ్చే ప్రశ్నల ఆధారంగా విద్యార్థి అభ్యాసన అంచనా వేస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా 1371 పాఠశాలల్లో 30 వేల 881 మంది విద్యార్థులకు గ్యారెంటెడ్ ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా సర్వే నిర్వహిస్తారన్నారు. విద్యార్థులకు సులభంగా గణిత బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు పి.నాగేశ్వరరావును ఏఎంవో అభినందించారు. అనంతరం పసలపూడి మోడల్ ప్రైమరీ పాఠశాలలో గ్యారెంటెడ్ ఎఫ్ఎల్ఎన్ సర్వేను డీఈవో కార్యాలయ ఏపీవో నల్లా నాగేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సూరంపూడి లోవరాజు, కోరుమిల్లి వెంకటరమణ, ఉపాధ్యాయుడు పీవీ రమణ, రామలక్ష్మి, పి.విజయ్‌కుమార్, సీఆర్పీ పోసి రాములు తదితరులు పాల్గొన్నారు.

డాబాపై ప్రకృతి సేద్యం

• రైతును అభినందించిన అధికారులు

ఆలమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డాబాపై ప్రకృతి సేద్యం చేయాలన్న ఆలోచనతో ప్రత్యేకంగా చేసిన బ్యాగ్‌లలో పశువుల ఎరువులను ఉపయోగించి కూరగాయల సాగు చేస్తున్న విధానం పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నది. ఆలమూరులో రైతు ఈదల రాంబాబు తన డాబాపై సాగు చేస్తున్న ప్రకృతి సేద్యాన్ని గురువారం ఆలమూరు వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్‌కెవీ చౌదరి, ప్రకృతి వ్యవసాయ ఎండీ ట్రైనర్ మద్దాల స్వరలత, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ కె.సూర్యప్రకాష్ గురువారం పరిశీలించారు. పశువుల ఎరువులు ఉపయోగించి కూరగాయల మొక్కలను పెంచడంతో రైతు రాంబాబు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని వారన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసేవారికి పలు సూచనలు, సలహాలు అందించేందుకు అందుబాటులో ఉంటామని వారన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

రావులపాలెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో గురువారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. వెదిరేశ్వరం జడ్పీ పాఠశాలలో హెచ్ఎం మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రావులపాలెం శ్రీచైతన్య పాఠశాలలో రీజనల్ ఇన్‌చార్జ్ నరేష్, ప్రిన్సిపాల్ జగదీష్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ రెండు పాఠశాలలో విద్యార్థులు మానవహారం చేపట్టి రాజ్యాంగంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సర్వారాయుడు, ఈశ్వరరెడ్డి, పాఠశాల చైర్మన్ బడుగు సుబ్బాయమ్మ తదితరులు పాల్గొన్నారు. రావులపాడు జడ్పీ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ కేవీ శేఖర్, ఎంఈవోలు నాగకుమార్, శ్రీనివాసరాజు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



వెదిరేశ్వరం జడ్పీ పాఠశాలలో విద్యార్థుల మానవహారం



పసలపూడిలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ

వాహనాల తనిఖీ

రాయవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి-చెల్లూరు వంతెన కూడలి వద్ద గురువారం పోలీసులు పలు వాహనాలను తనిఖీ చేశారు. మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు ద్విచక్ర వాహనాలతో పాటు పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాల రికార్డులు సక్రమంగా ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. వాహనం నడిపే వారంతా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. రికార్డులు సక్రమంగా లేని వారికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

కె.గంగవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం తామరపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మనబడి - మన భవిష్యత్ పథకం కింద రూ.12 లక్షలతో నిర్మించిన వంటశాలను, మరుగుదొడ్లను ప్రారంభించారు. వాటి శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య విషయంలో కావల్సిన సత్యం ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం సూపరింటెంట్ సురేంద్ర రెడ్డి, ఎంఈవో ఏ.నాగరాజు, గ్రామ సర్పంచ్ తోకల మంగ, ఉప సర్పంచ్ బోడపాటి మంగా దేవి, టీడీపీ నాయకులు గన్ని శ్రీనివాసు, టీడీపీ ప్రచార కార్యదర్శి చిల్లే నాగేశ్వరరావు, కంచుమర్తి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



తామరపల్లిలో వంటశాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వాసంశెట్టి సత్యం

విజయనగరంలో రాములవారికి ఎమ్మెల్యే వేగుళ్ల పూజలు

మండపేట, నవంబరు, 27(ఆంధ్రజ్యోతి): మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు జిల్లాల పర్యటనలో భాగంగా గురువారం విజయనగరంలోని నారాయణపురం రాములవారి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అంచనాల కమిటీ సభ్యులతో వెళ్లిన ఆయన రాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు, కమిటీ సభ్యులకు స్వాగతం పలికారు. విజయనగరంలో వున్న పైడితల్లమ్మను ఎమ్మెల్యే బృందం దర్శించుకుంది. అనంతరం వారికి ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాలతో పాటు ప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో మార్కండేయస్వామి ప్రతిష్ఠ

ద్రాక్షారామ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ఉండూరు గ్రామంలోనున్న మార్కండేయస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గురువారం బాలఆలయంలో స్వామివారి ప్రతిష్ఠ జరిగింది. ఆయా కార్యక్రమాలను ఆలయ అర్చకులు కొత్తలంక బాలసుబ్రహ్మణ్యశాస్త్రి, కొక్కిరిగడ్డ సీతయ్య జరిపించారు. కార్యక్రమంలో చిగురుపాటి వీర్రాజు, చిగురుపాటి సాయి, కొరిపెల్ల వీర వెంకట సత్యనారాణ, టీడీపీ నేత వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, మాజీ సర్పంచ్ టేకుమూడి సత్యనారాయణ, దేవదాయశాఖ డీఈఈ ఉదయ్‌కుమార్, ఆలయ ఈవో యాళ్ల సత్యనారాయణ, చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ ఈవో వీర్రాజు చౌదరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

48 గంటల్లోనే ఉపాధి హామీ జాబ్‌కార్డు

మండపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కూలీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 48 గంటల వ్యవధిలోనే నూతన జాబ్‌కార్డు పొందేందుకు వెసులుబాటు కల్పించింది. గతంలో జాబ్ కార్డు పొందాలంటే చాలా అవస్థలు పడాల్సి వచ్చేది. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈకేవైసీ నిర్ణయాలతో 48 గంటల్లోనే ఉచితంగా జాబ్‌కార్డు అందజేసే ప్రక్రియ ప్రారంభమైంది. సభ్యుల పేర్ల నమోదు, చిరునామా మార్పులు, చేర్పులకు ఆదేశాలు వచ్చాయని, ఉపాధి కూలీలకు ఇది మేలు చేస్తుందని మండల ఎంపీడీవో సత్యనారాయణమూర్తి తెలిపారు.

శబరిమలకు అయ్యప్ప భక్తుల పయనం

రాయవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామాలయం వద్ద అయ్యప్ప మాలదారుల ఇరుముడుల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామానికి చెందిన పీఎస్ఆర్ గురుస్వామి ఆధ్వర్యంలో పలువురు అయ్యప్పభక్తులు ఆలయంలో పూజలు చేసి ఇరుముడులు కట్టుకున్నారు. అనంతరం వారు శబరిమలకు బయలుదేరి వెళ్లారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం

ఆత్రేయపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల చినపేటలో సంభవించిన అగ్నిప్రమాదంలో పమ్మి శాంతకుమారికి చెందిన తాటాకిల్లు దగ్ధమైన ఘటనలో వారు నిరాశ్రయులైన సంగతి తెలిసిందే. గురువారం యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు, వంట సామగ్రిని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు చేతులు మీదుగా బాధిత కుటుంబానికి అందచేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

రావులపాలెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రావులపాలెం శ్రీ చైతన్య పాఠశాలలో ఎంఈవో బి.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ నాసా కాంటెస్ట్ కిట్లను ఎంఈవో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక వైజ్ఞానికపై ఆవశ్యకత పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ ఇన్‌చార్జ్ నరేష్, ప్రిన్సిపాల్ జగదీష్, నాసా ఇన్‌చార్జ్ ఎన్.హారిక తదితరులు పాల్గొన్నారు



ఆలమూరు జడ్పీ గరల్స్ హైస్కూల్‌లో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

జడ్పీ గరల్స్ హైస్కూల్‌లో ఆకట్టుకున్న మాక్ పోలింగ్

ఆలమూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా ఆలమూరు బొబ్బా జయశ్రీ జడ్పీ గరల్స్ హైస్కూల్‌లో గురువారం చిన్నారుల్లో పోలింగ్‌పై అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించారు. చిన్నారులు పోలింగ్‌లో పాల్గొని ఓటుహక్కును ఉపయోగించుకునే విధానం వారితో చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.ఉమ, ఉపాధ్యాయులు మాచరరావు, అన్నపూర్ణ, కామవరపు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సమావేశ మందిరానికి భూమిపూజ

మండపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలో వున్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సమావేశాలు నిర్వహించుకునేందుకు అవసరమైన సమావేశ మందిరానికి గురువారం భూమిపూజ, శంకుస్థాపన జరిగింది. గ్రామానికి చెందిన హోమియో వైద్యులు నాగులాపల్లి సీతారామస్వామినాయుడు ఆర్థిక సహకారంతో వీటి పనులు చేపట్టామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.మురళీకృష్ణ, గోణం వుల్లయ్య, కోట లక్ష్మణ్, హచ్ఎం బత్తిన రాజేశ్వరి, కె.జ్యోతి, నాగసుజాత, భ్రమరాంబ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఫర్నీచర్ అందజేత

మండపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండపేటలో వున్న పాలడుగు చంద్రమౌళి జిల్లాపరిషత్ హైస్కూల్‌కు మండపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినులకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో కెనడాకు చెందిన వైద్యురాలు శారదాశ్రీ విద్యార్థినులకు పలు వైద్య సలహాలు చేశారు. ఆలమూరుకు చెందిన వ్యాపారి వంటిపల్లి పాపారావు శానిటరీ నాప్కిన్స్ డిస్ట్రోస్ మిషన్ అందించారు. రోటరీ క్లబ్ మండపేట ఫర్నిచర్, డాక్టర్ పాలడుగు చంద్రమౌళి ఆట వస్తువులు అందించారు. అలాగే 300 మంది విద్యార్థినులకు బాలికల సురక్ష పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.వెంకట్రాజు, మండపేట రోటరీ అధ్యక్షుడు బొబ్బా రామకృష్ణ, డాక్టర్ చంద్రమౌళి, రోటరి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు నల్లమిల్లి వెంకటకృష్ణారెడ్డి, కొనగళ్ల విశ్వనాథం, ఇమ్మిడిశెట్టి నాగభూషణం, వెలగల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.